# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ /వనపర్తి /జోగులాంబ గద్వాల/నారాయణపేట


# రావమ్మ మహాలక్ష్మీ..!



## గ్రామాలకు చేరని పల్లె వెలుగులు
## ఉచిత బస్సులు ఎందుకని ప్రశ్నిస్తున్న గ్రామీణ మహిళలు

**ఉండవెల్లి, డిసెంబరు 19 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలలో ఒకటి ఉచిత మహిళా బస్సు ప్రయాణం ఈ పథకం బాగానే ఉన్నా కానీ పల్లెటూర్లకు చేరని పల్లె వెలుగుల బస్సుల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పల్లెటూరు మహిళలు తమ గ్రామాలకు రోడ్లు ఉన్న కానీ ఇంకా మాకు బస్సులు రాకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పల్లెటూరు నుండి పట్నం రావాలంటే ఆటోల వైపే చూడాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. కరోనా కంటే ముందు ప్రతి పల్లెకి బస్సులు చేరేవని కరోనాకాలం తర్వాత పల్లెలకు బస్సులు పంపించడమే మానేశారని వాపోతున్నారు. పథకం అద్భుంగా ఉన్న తమ దరిచేరినప్పుడు వీటివల్ల ఏమిటి అని వ్యక్తం చేస్తున్నారు. అనేక ప్రాంతాల ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం బయటికి వెళ్లాలంటే ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. కేవలం జాతీయ రహదారులపై మాత్రమే మారుమూల ప్రాంతాల నుండి ప్రజలు, విద్యార్థులు నానా తంటాలు పడి ప్రధాన రహదారులకు చేరుకున్న సమయానికి ఆర్టీసి బస్సులు రాక, పల్లెల నుండి మండల నియోజకవర్గ జిల్లా, రాష్ట్ర కేంద్రాలకు చేరుకునే ప్రయత్నంలో మళ్లీ ప్రైవేట్ వాహనాలపై ఆధారపడే పరిస్థితి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ఆర్టీసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తుంది. ప్రభుత్వ నిర్ణయం బాగానే ఉన్నా అసలు బస్సులు రాని పల్లెల నుండి మహిళలు బస్సు ప్రయాణం ఎలా చేస్తారనే ప్రశ్న తలెత్తుతోంది. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల పల్లె వెలుగు బస్సులు మొత్తం ప్రధాన పట్టణాలకు పరిమితం కావడంతో ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించే ప్రజలు అధిక రవాణా చార్జీలతో అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పటికి గ్రామీణ ప్రాంతాలకే కాదు కొన్ని మండల కేంద్రాల్లో కూడా బస్సు సౌకర్యం లేదంటే అతిశయోక్తి కాదు. నూతన సర్కార్ మహిళా సౌలభ్యం కోసం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం హర్షించదగ్గదే కానీ, ఆ పథకం సంపూర్ణంగా అమలు జరిగి ప్రతి మహిళకు న్యాయం జరగాలంటే ప్రతి పల్లెవెలుగు రావాలని ప్రభుత్వం దానిపై దృష్టి సారించాలని పల్లెటూరు గ్రామాల మహిళలు కోరుతున్నారు. పల్లెకు పల్లె వెలుగు రావడం వల్ల ప్రజలకు విద్యార్థులకు కూడా చాలా మేలు జరుగుతుందని సురక్షిత ప్రయాణం కూడా అందుతుందని ఆర్థిక నష్టం కూడా జరగదని అంటున్నారు. ఈ విషయమై కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు త్వరగా తీసుకొని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పల్లెల్లో ఆర్టీసి బస్సులను పునరుద్ధరించేలా చూడాలని మహిళలు అంటున్నారు.

**నియోజవకవర్గంలో ఇలా...**

అలంపూర్ నియోజకవర్గంలోని 124 గ్రామ పంచాయతీల్లో 57 గ్రామాలకు ఆర్టీసి బస్సు తిరగడం లేదు. ముఖ్యంగా ఉండవెల్లి మండలంలో 16 గ్రామ పంచాయతీలకు బొంకూర్ మినహా మిగిలిన 15 పంచాయతీలకు బస్సు సర్వీస్ లేవు. గ్రామాలు ఆంధ్రప్రదేశ్‌కు దగ్గరగా ఉండడంతో అన్ని గ్రామాలకు కర్నూల్ డిపోకు చెందిన బస్సులు తిరుగుతున్నాయి.

## ఎమ్మెల్యే యెన్నంకు మన్యంకొండ అర్చకుల ఆశీర్వచనం..

**-స్వామివారి చిత్రపటాన్ని అందజేసి దేవస్థానానికి ఆహ్వానించిన చైర్మెన్**

**దేవరకద్ర, డిసెంబరు 19 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని మంగళవారం మన్యంకొండ దేవస్థానం చైర్మెన్ అళహరి మదుసూధన్‌కుమార్ ఆధ్వర్యంలో దేవస్థానం అర్చకులు అశిర్వచనం పలికారు. అలాగే ఎమ్మెల్యేకు స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. శాలువాకప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వగృహంలో ఆయనను దేవస్థానం తరుపున మర్యాదపూర్వకంగా కలసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మన్యంకొండ దేవస్థానానికి రావాల్సిందిగా ఎమ్మెల్యేను దేవస్థానం చైర్మెన్ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఠ శ్రీనివాసరాజులతో పాటు దేవస్థానం ప్రధాన పూజారులు రాజేశ్, నరసింహ్మయ్య, పాలకమండలి సభ్యులు, పర్యవేక్షకుడు నిత్యానందచారి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న చైర్మెన్ మధుసూధన్‌కుమార్

## శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు

**ఎమ్మెల్యే స్వగృహంలో విందుకు హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు**

**చిన్నచింతకుంట, డిసెంబరు 19 ప్రభాతవార్త :** పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామిని మంగళవారం ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు దర్శించుకున్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డా.వంశీకృష్ణలు శ్రీ కురుమూర్తి స్వామి కొండకు చేరుకోగానే ఆలయ అధికారులు స్వాగతం పలుకుతూ కొండపై ఉన్న ప్రధాన ముఖద్వారం వద్దకు చేరుకోగానే ఆలయ మర్యాదల్లో భాగంగా అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అక్కడి నుండి నేరుగా స్వామివారి ప్రధానాలయంలోని శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేలను శాలువాతో సత్కరించి ఆలయ అర్చకులు ఎమ్మెల్యేలను శాలువాతో సత్కరించి ఆలయ విశిష్టత వివరించి ఆశీర్వచనాలు చేశారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంకటేశ్వరస్వామి ప్రతిరూపమైన శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని ఎమ్మెల్యేలు తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్ర, ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలు సుభిక్షంగా జీవించాలని వారు కోరారు. అక్కడి నుండి నేరుగా ఎమ్మెల్యే జిఎంఆర్ స్వగ్రామమైన దమగ్నపూర్‌లోని ఆయన స్వగృహానికి చేరుకున్నారు. అక్కడికి మంత్రి జూపల్లి కృష్ణారావు, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి రావడంతో అక్కడ ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. వీరితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మంత్రి జూపల్లికి స్వాగతం పలుకుతున్న జిఎంఆర్



మంత్రి జూపల్లికి స్వాగతం పలుకుతున్న జిఎంఆర్

## అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు
## సమాచారం ఇవ్వాలి:జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్



**నారాయణపేట ప్రతినిధి, డిసెంబరు 19 ప్రభాతవార్త :** మక్తల్ పరిధిలో దొంగతనాలు పెరుగుతు న్నందున పోలీస్ పెట్రోలింగ్ పెంచడం జరిగిందని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ పట్టణ కేంద్రంలోని కాలనీలలో ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చిన అనుమానిత వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీస్ వారికి డయల్ 100 లేదా 24/7 పోలీస్ కంట్రోల్ రూమ్ నం. 871 2670399కి, లేదా సంబంధిత లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ తెలిపారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో పూర్తిస్థాయి పెట్రోలింగ్ పెంచడం జరిగిందని పెట్రోకార్ పెట్రోలింగ్, బ్లూ కోట్స్ పెట్రోలింగ్, అలాగే మఫ్టీలో పోలీసులను, టాస్క్‌ఫోర్స్ పోలీసుల ద్వారా నిరంతరం నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. దొంగతనాలు నిర్మూలనకు పూర్తిస్థాయి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. అలాగే పాత నేరస్తులపై నిఘా ఏర్పాటు చేసి ప్రతిరోజు వారిని తనిఖీ నిర్వహించడం జరుగుతుందని ప్రజలు ఎవరైనా గ్రామాలలో ఎక్కువ రోజులు ఇండ్లకు తాళం వేసి టూర్లు లేదా బంధువుల ఊర్లకు వెళ్లినచో సంబంధిత లోకల్ పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఆయా ఏరియాల్లో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసి పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. గ్రామాలలో ప్రజలు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలు చేయడానికి భయపడతారని అసాంఘిక కార్యకలాపాలు నిర్మూలించడానికి అవకాశం ఉంటుందని ప్రతి గ్రామంలో ప్రజలు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ కోరారు.

## బట్టలు పెట్టడం సంప్రదాయం..

**క్రిస్టియన్లకు దుస్తుల పంపిణీలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 19 ప్రభాతవార్త :** ఇతరులను గౌరవించి, ప్రేమతో బట్టలు పెట్టడం మనకు తరతరాలుగా వస్తున్న సంప్రదాయం అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని చర్చి పాస్టర్స్‌కు క్రిస్మస్ పండగ సందర్భంగా పాస్టర్లను పిలిచి బట్టలు పెట్టి ఘనంగా సత్కరించారు. అంతకు ముందు క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ప్రత్యేక కేక్‌ను ఎమ్మెల్యే కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవచింతన చేస్తూ, సమాజ శ్రేయస్సుకు పాటుపడుతూ, దైవ మార్గం చూయించే పాస్టర్లకు క్రిస్మస్ పండగ సందర్భంగా అలాగే ఉగాది పండగ సందర్భంగా పూజారులకు, రంజాన్ పండగ సందర్భంగా మోజన్స్‌కు బట్టలు పెట్టడం నాకు చాలా ఇష్టమైనదని చెప్పారు. రాజ్యాంగం ప్రకారం అన్ని మతాలు ఒక్కటే అని, ధర్మం బోధించే ప్రతి గ్రంథంలోని సారం ఒక్కటే అని అందుకే వాటిని నేను అనుసరిస్తూ ముందుకు సాగుతున్నానని ఆయన చెప్పారు. ధర్మం తప్పకుండా ఏ పని చేసినా అది ఆత్మతృప్తి కలుగుతుందని చెప్పారు. ఆత్మ తృప్తి లేనిది ఏది ఉపయోగం లేదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిజె బెనహర్, బండ సునీల్‌కు మార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్, మైనార్టీ అధ్యక్షులు, టి. రాజేందర్, సుజయ్, భూషణ్, ప్రశాంత్ పాస్టర్స్ పాల్గొన్నారు.





క్రిస్టియన్లకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

## కురుమతి రాయుడికి ప్రత్యేక పూజలు..

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 19 ప్రభాతవార్త :** పోతన్‌పల్లి గ్రామంలో కురుమతి రాయుడి దేవాలయంలో బుధవారం ఉద్దాల ఉత్సవాల్లో భాగంగా మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేను సాదరంగా ఆలయంలోకి ఆహ్వానించారు. అనంతరం కురుమూర్తి స్వామికి సమర్పించే ఉద్దాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ ఉద్దాల ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల్లో ఎంతో విశిష్టత ఉందని, ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు తెలిపారు. కురుమూర్తి దేవాలయానికి తీసుకొని వెళ్లే ఉద్దాలకు గల ప్రత్యేకత ఆయనకు వివరించారు. ఎంతో నిష్టతో ఉద్దాలను గ్రామంలో తయారు చేస్తారని ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి మనెమ్మ, సర్పంచ్ సత్యమ్మ, చెన్నప్ప, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, వెంకటయ్య, బాల్‌చందర్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

# ఇది ప్రజల పార్టీ.. వారి సమస్యలు తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం..

**నారాయణపేట ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణికరెడ్డి**

**నారాయణపేట ప్రతినిధి, డిసెంబరు 19 ప్రభాతవార్త :** ఎమ్మెల్యేగా గెలిచాక ఇక ఇప్పుడు నేను ఏ పార్టీలను చూడనని నా పార్టీ ప్రజల పార్టీ అని వారి సమస్యలు తీర్చడమే నా లక్ష్యమని ప్రజల సమస్యలను పార్టీలకతీతంగా అందరం పరిష్కరించుకుందామని అన్నారు. గతంలో ఏం జరిగిందనేది అనవసరం మున్సిపాలిటీ ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలో అందరం కలిసి కట్టుగా కూర్చుని మాట్లాడుకొని అభివృద్ధి చేసుకుందామని నారాయణపేట ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణికరెడ్డి అన్నారు. మంగళవారం నారాయణపేట మున్సిపాలిటీ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ గందె అనసూయ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత మొదటిసారిగా డా. చిట్టెం పర్ణికరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్నికల అనంతరం జరిగిన సమావేశంలో వార్డు కౌన్సిలర్లు వాడి వేడిగా తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను సమావేశంలో ప్రస్తావించారు. కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ ఎండి సలీం మాట్లాడుతూ తాను కౌన్సిలర్‌గా ఎన్నికై నాలుగు సంవత్సరాలు అవుతున్న తమ వార్డులో ఇప్పటివరకు అభివృద్ధి పనులు చేపట్టలేదని ప్రతిపక్ష పార్టీల వార్డులపై వివక్ష చూపుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గతంలో మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ చిట్టెం నర్సిరెడ్డి ఐడిఎస్ఎంటి పథకం ద్వారా షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలు నిర్మించగా వాటి ద్వారానే నేడు సిబ్బంది జీతభత్యాలు చెల్లిస్తున్నారు తప్ప టిఆర్ఎస్ మున్సిపాలిటీకి ఆదాయ వనరులు సమకూర్చే నిర్మాణాలు చేపట్టలేదన్నారు. మున్సిపాలిటీలో అధికారుల చేయి తడపందే పనులు చేయడం లేదని ఈ విషయం పత్రికల్లో కూడా వచ్చిందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మున్సిపాలిటీలో అవినీతిని నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం 7వ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు కౌన్సిలర్ సలీం వినతి పత్రం అందజేశారు. బిజెపి ఫ్లోర్ లీడర్ సత్యరఘుపాల్‌రెడ్డి, రాఘవేంద్రలు మాట్లాడుతూ తమ వార్డులలో సైతం అభివృద్ధి పనులు చేపట్టకుండా వివక్ష చూపుతున్నారన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ప్రారంభానికి నోచుకోలేక వృధాగా పడి ఉన్నాయని కోట్లు వెచ్చించినా ఉపయోగంలోకి రాకుండా పోయాయని అనడంతో బిఆర్ఎస్ కౌన్సిలర్లు మేఘ, బండి రాజేశ్వరి, శిరీష, జొన్నల అనిలు బిజెపి కౌన్సిలర్లతో వాగ్వాదానికి దిగారు. గతంలో మా మాజీ ఎమ్మెల్యే ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారని అనవసరంగా అభివృద్ధి పనులపై తప్పుగా మాట్లాడొద్దన్నారు. చైర్మన్ కల్పించుకొని వార్డుల వారిగా తమ సమస్యలు ప్రస్తావించాలని కోరడంతో సభ్యులు శాంతించి తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలు తీర్చాలని అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా వార్డులను అభివృద్ధి చేసుకుందామని ఇకనుండి నెలనెల కౌన్సిల్ సమావేశాలు జరపాలని, నేనే కూడా అన్ని సమావేశాలకు హాజరవుతానన్నారు. వచ్చే సమావేశం నాటికి 2014 సం॥ నుండి ఇప్పటివరకు ఎన్ని నిధులు వచ్చాయి. చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు అన్ని తనకు ఇవ్వాలని, ఇప్పటివరకు అభివృద్ధి చేయని వార్డులకు మొదటి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పరిచే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అంతకు ముందు నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేను చైర్‌పర్సన్, కౌన్సిలర్లు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పుర కౌన్సిలర్ సునిత మేనేజర్ యూసుఫ్ ఇంజనీర్ మహేష్ సమావేశంలో పాల్గొన్నారు.



మున్సిపల్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే





సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు





ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

**ఎమ్మెల్యే చొరవతో మీడియాకు అనుమతి...**

నూతన పురపాలక చట్టం ప్రకారం గత కొన్ని కౌన్సిల్ సమావేశాలకు మీడియాను అనుమతించని అధికారులు ఈ విషయమై కొన్ని పత్రికల్లో రావడంతో ఆరా తీసిన ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణికరెడ్డి కౌన్సిల్ సమావేశానికి మీడియా అనుమతించాలని కమిషనర్ ఆదేశించడంతో అధికారులు మీడియాను సమావేశానికి అనుమతించారు.

# అవినీతిపై బహిరంగ చర్చకు మీరు సిద్ధమా..!

**అవినీతి నిరూపణ అయితే రాజీనామాకు సిద్ధమా**
**మున్సిపల్ చైర్మన్‌కు కాంగ్రెస్ పట్టణాధ్యక్షులు సవాళ్లు....**
**మున్సిపల్ చైర్మన్‌గా ఉంచే అవినీతిని బట్టబయలు చేస్తాం...**
**నిమోజకవర్గ ఇంచార్జి సతీష్, పట్టణాధ్యాక్షులు చీర్ల చందర్**

**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్19, ప్రభాతవార్త :** వనపర్తి మున్సిపాలిటి కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్ అధ్యక్షతన అవినీతి జరుగుతుందని అందుకు సంబంధించిన అవినీతిపై బహిరంగ చర్చకు ఎక్కడికి పిలిచినా ఏ సమయానికి పిలిచినా మేము సిద్ధంగా ఉన్నామని మీరు సిద్ధంగా ఉన్నారా అని అవినీతి నిరుపణ అయితే చైర్మన్ పదవికి రాజీనామా చేయడానికి సిద్ధమా అని కాంగ్రెస్ పార్టి నిమోజకవర్గ ఇంచార్జి సతీష్, పట్టణాధ్యాక్షులు చీర్ల చందర్ లు సవాళ్ల విసిరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత 4 సంవత్సరాల కాలంలో వనపర్తి మున్సిపాలిటి పరిధిలో కనివిని ఎరుగని రీతిలో అవినీతి జరిగిందని వారు విమర్శించారు. మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్ అవినీతిని అడ్డాగా వనపర్తి మున్సిపాలిటిని మార్చుకున్నారని చైర్మన్ ముసుగులో ఎంతో అవినీతిని పాల్పడ్డారన్నారు. జిల్లా కేంద్రంలోని సమీపంలోని 1171 సర్వే నెంబర్‌లో 25.09.2023 వ తేదిన లే అవుట్ అనుమతి ఉందని రూ 2లక్షల చొప్పున ఇండ్ల నిర్మాణ అనుమతికి కట్టాలని పాత ఎల్ఆర్ఎస్‌ను చూయించి 7 ఇండ్లకు గాను మొత్తం రూ 14 లక్షల ఆదాయాన్ని అవినీతి చేశారన్నారు. జిల్లా కేంద్రంలోని నల్లచెరువు మీద మాట్లాడిన చైర్మన్ నల్లచెరువు కట్టకు సంబంధించిన నిధులు ఎవరు ఏ పేరు మీద తీసుకున్నారో ప్రజలకు తెలుసునన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కన విజయ ఆయిల్ ఫామ్ దుకాణం పేరు మీద 30 సంవత్సరాలు లీజ్ కు ఎవరు తీసుకున్నారని, ఇండ్రస్టీయల్ జోన్‌గా ఉన్న వాటిని రెసిడెన్షియల్ జోన్ గా మార్చిన 137 సర్వే నెంబర్‌లో లగిశెట్టి శ్రీనివాసులు అనే వ్యక్తి నుండి రూ 20లక్షలు తీసుకున్నారని ఒకే రోజు మున్సిపాలిటి నుండి ఒకే రోజు అనుమతి పత్రాలను ఇచ్చి రెండు రోజులు తరువాత అనుమతి రద్దు చేశారని అందుకు సంబంధించిన ఆధారాలతో మాట్లాడుతున్నామని ఇందుకు సంబంధించిన వాటిపై బహిరంగ చర్చకు సిద్ధమని మీరు సిద్ధమా అని వారు ప్రశ్నించారు. అవిశ్వాస తీర్మానం వస్తుందని అనుకోవాల్సిన అవసరం లేదని మిమ్మల్ని చైర్మన్ గా ఉంచి అవినీతిని బయట పెట్టడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు చీర్ల సత్యం, విభూతినారాయణ, శ్రీనివాసులు నాయకులు ఖైరూన్ బేగం, షఫి, మండ్ల దేవన్న నాయుడు, చుక్క రాజు తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇంచార్జి సతీష్, పట్టణాధ్యాక్షులు చీర్ల చందర్

# హోరాహోరీగా కబడ్డీ పోటీలు..

- ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో బాలికల విభాగంలో విజేతగా గద్వాల్ జట్టు... బాలుర విభాగంలో నారాయణపేట జిల్లా జట్టు...
- బాల బాలికల కబడ్డీ పోటీల్లో 2వ స్థానాల్లో నాగర్‌కర్నూల్ జిల్లా
- రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకై ఎంపికైన విద్యార్థులు

**నాగర్‌కర్నూల్‌ప్రతినిధి, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** అండర్ -17 నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, గద్వాల్ ఉమ్మడి జిల్లా కబడ్డీ పోటీల విజేతలుగా బాలికల విభాగంలో గద్వాల జిల్లా జట్టు, బాలుర విభా గంలో నారాయణ పేట జిల్లా జట్టు సొంతం చేసుకున్నాయని నాగర్‌కర్నూల్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పాండు మంగళవారం తెలిపారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా బిజనపల్లి మండల కేంద్రంలోని మాస్టర్ మైండ్ పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం ఈ పోటీలు ఉత్కంఠ భరితంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి 6 గంటల వరకు వివిద దశల్లో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఫైనల్స్‌లో బాలుర నారాయణపేట, నాగర్‌కర్నూల్‌జట్లు తలపడగా 26-24 పాయింట్లతో నారాయణపేట జట్టు విజయం సాధించింది. బాలికల విభాగంలో గద్వాల-నాగర్‌కర్నూల్ జట్లు పోటీ పడగా అందులో 28-24 పాయింట్లతో గద్వాల జిల్లా జట్టు విజేతగా నిలిచింది. టోర్నీ రన్నర్స్‌గా బాలుర విభాగంలో నాగర్‌కర్నూల్ జిల్లా జట్టు, 3వ స్థానంలో గద్వాల జిల్లా జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో రన్నర్స్‌గా నాగర్‌కర్నూల్ జిల్లా జట్టు, మూడో స్థానంలో నారాయణపేట జిల్లా జట్లు నిలిచాయి. విజేతలకు టోర్నమెంట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ నిరంజన్‌యాదవ్, ఎస్ పీసీ కార్యదర్శి ప్రసాద్‌గౌడ్, ఎస్ జీ ఎఫ్ కార్యదర్శి పాండులు చాంపియన్ కప్‌లతో పాటు మెమెంటోలు, షీల్డ్‌లు అందజేశారు. ఈ నెల 23వ తేదీన హన్మకొండలో రాష్ట్ర స్థాయి అండర్ 17 బాల బాలికల కబడ్డీ పోటీలకు ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల ధికారి సీతారాంనాయక్, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పాండు, ఎస్‌పీసీ కార్యదర్శి ప్రసాద్‌గౌడ్, జిల్లాకబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యాదయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు నిరంజన్, రమేష్, వెంకటయ్య, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, నారాయణపేట జిల్లాల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో పేరును నమోదు చేసుకోవాలి..

**వనపర్తి కలెక్టర్ తేజస్ నంద లాల్ పవర్...**

**వనపర్తి టౌన్, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** జనవరి 1, 2024 నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకునే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ సూచించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ పై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సాయంత్రం ఐ.డి.ఓ.సి. కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్ ప్రకారం జనవరి 1 నాటికి 18 సంవత్సరాల వయస్సు పూర్తి చేసుకునే యువతను ఓటరు జాబితాలో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా రాబోయే ఎన్నికలకు అవసరమైన చోట కొత్త పోలింగ్ స్టేషన్ ల ఏర్పాటు, తొలగించడం వంటివి ఏమైనా ఉంటే ప్రతిపాదనలు ఉంటే పంపించాలని కోరారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌కు ఇది సువర్ణావకాశం అని దీనిని సద్వినియోగం చేసుకొని ప్రతిపాదనలు ఇవ్వాల్సిందిగా రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు.

అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎస్.గాంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎస్.తిరుపతి రావు, భా.రా.స నుండి మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, కాంగ్రెస్ నుండి జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ యాదవ్, సి.పి.యం నుండి జబ్బార్, బి.ఎస్.పి నుండి గణపురం కృష్ణ, తహాశీల్దార్ రమేష్ రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

## వైద్య కళాశాల నిర్మాణ పనులు మార్చిలోపు పూర్తి చేయాలి:జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**నారాయణపేట ప్రతినిధి, డిసెంబరు 19 ప్రభాతవార్త :** వైద్య కళాశాల నిర్మాణ పనులు మార్చిలోపు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులు, ఇంజనీర్లను ఆదేశించారు. మంగళవారం అప్పంపల్లి దగ్గర నిర్మిస్తున్న మెడికల్ ఆసుపత్రి నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి పనుల పురోగతిని పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం మార్చి 2024లోపు పనులన్నింటిని పూర్తి చేయాలని అధికారులను, ఇంజనీర్లను ఆదేశించారు. అవసరమైతే ఇంకా ఎక్కువ మంది లేబర్‌ను తీసుకుని పనులు పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

## మృతి చెందిన కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



**వనపర్తి టౌన్, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా కేంద్రంలో వనపర్తి పట్టణం లోని నా గవరం తాండకు చెందిన సభావాత్ రాములు అనారోగ్యం బాగు లేక మరణించడం జరిగింది విష యం తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి వారి కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సాయం చేయడం జరిగింది. సభావాత్ మృత దేహానికి కాంగ్రెస్ నాయకులు వనపర్తి నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్ వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్ కౌన్సిలర్స్ సుమిత్ర యాదగిరి బి వెంకటేశ్వర్లు రవి యాదవ్ వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ డి వెంకటేష్ ఓబిసి పట్టణ అధ్యక్షులు బొంబాయి మన్నెంకొండ రాజు నాయక్ లతీఫ్ అస్లాం అజిల్ అస్లాం పటేల్ సభావాత్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది మంణించిన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని హామీ ఇవ్వడం జరిగింది.

## కొల్లాపూర్ ఎస్సైపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు




**కొల్లాపూర్, డిసెంబరు 19 ప్రభాతవార్త :** అర్ధరాత్రి కిడ్నాప్ చేసి హత్య చేయటానికి ప్రయత్నించిన ఎస్సై బాల వెంకటరమణపై కేసు నమోదు చేయాలని కొల్లాపూర్ పట్టణానికి చెందిన బాలరాజు అనే యువకుడు మంగళవారం ఏఎస్సై రామస్వామిగౌడ్‌కు ఫిర్యాదు చేశారు. గత సంవత్సరం ఆగస్టు నెలలో బాలరాజు అనే యువకుడిపై అకారణంగా దాడిచేసి హత్య చేయడానికి ప్రయత్నించాడని తమ కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేసి అసభ్య పదజాలంతో దూషించాడని తమ తల్లిని బూట్ కాలుతో తన్నడం జరిగిందని, తనను శరీరంపై బట్టలు తొలగించి తీవ్రంగా దాడిచేసి చంపుతానని బెదిరించాడని, ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే భూమిపైన ఉండవని మంత్రి జూపల్లి కృష్ణారావుపై సైతం అసభ్య పదజాలంతో దూషించి ఎవడొస్తాడో చూస్తానంటూ దాడిచేసిన సంఘటనపై దర్యాప్తు చేసి కేసు నమోదు చేయాలని చట్టరిత్యా అతనిపై చర్యలు తీసుకోవాలని బాలరాజు ఫిర్యాదులు కోరాడు.

## కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ 56వ వర్ధంతి



**నవాబ్‌పేట, డిసెంబరు 19 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో మంగళవారం కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ 56వ వర్ధంతిని ఎర్రసత్యం చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గోపాల్, మాజీ సర్పంచ్‌లు గాండ్ల శేఖర్ అన్న, ఎం. వెంకటయ్య, గ్రామ పంచాయతీ జిపి నంబర్లు కొల్లి నర్సింలు, చిర్పసత్యం, దడువై సత్యం, మత్యాసంఘం అధ్యక్షులు డి.ఆనంద్, గ్రామపెద్దలు పులి అంజయ్య, చికెన్ సెంటర్ శ్రీను, నర్ల నర్సింలు పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల ఎర్రసత్యం యువసేన అధ్యక్షుడు వెంకటస్వామి, మల్లేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## నూతన వ్యవసాయ పద్ధతులను పాటించాలి



విసకిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్న శాస్త్రవేత్త

**బిజినేపల్లి, డిసెంబరు 19 ప్రభాతవార్త :** రైతులు నూతన వ్యవసాయ పద్ధతులను పాటించి అధిక దిగుబడులను పొందాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా. ఆదిశంకర్ కోరారు. కారుకొండలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర మంగళ వారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా రైతులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా అందించే వ్యవసాయ పథకాల గురించి వివరించారు. పిఎం కిసాన్ యోజన, డ్రోన్ యోజన, భూసార పరీక్ష,భూసార పరీక్ష పత్రం,ఉద్యాన పంటల్లో సబ్సిడి, సూక్ష్మబిందు పరికరాల సబ్సిడిల గురించి శాస్త్రవేత్త డా.ఆది శంకర్ వివరించారు.డ్రోన్ ద్వారాఅన్ని పంటల్లో పిచికారి చేసుకుని సమయం, ఖర్చు తగ్గించవచ్చని సూచించారు. కార్యక్రమంలో రైతు క్షేత్రాల్లో యాసంగి పంటల్లో వేరుశనగ పంట సందర్శన, రైతు పరశురాములు సాగు చేసిన కుసుమ పంటను సందర్శించి పంట దిగుబడికి సూచనలు వివరించారు.

## చిన్నపాటి వ్యవసాయ యంత్రాలపై అవగాహన



**బిజినేపల్లి, డిసెంబరు 19 ప్రభాతవార్త:** రైతులు కొద్దిపాటి వ్యవసాయ చిరుధాన్యాల దిగుబడిని చిన్నపాటి వ్యవసాయ యంత్రాల ద్వారా శుభ్రంగా మార్చుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఈ జోత్స్నా సూచించారు. ఖానాపూర్ గ్రామంలో పోర్టబుల్ గ్రైండర్ పని విధానం, దాని వలన కలిగే లాభాలను వ్యవసాయ మహిళలకు, రైతులకు మంగళవారం వివరించారు. పంట పొలాల్లో పండించిన తృణధాన్యాలను గ్రైండర్ ద్వారా మట్టి, చెత్త చెదారం లేకుండా సుల భంగా తక్కువ సమయంలో శుభ్రం చేసుకోవచ్చని సూచించారు. సాంప్రదాయ పద్ధతి అయిన చాట, జల్లెడలతో శారీరక శ్రమతో పాటు చేతులు, మెడ నొప్పులు వస్తాయని వివరించారు. శుభ్రమై న ధాన్యాన్ని అధిక ధరకు విక్రయించుకోవడం వల్ల అధిక లాభాలు ఆర్జించవచ్చని తెలిపారు.

## ఘనంగా బయట మారెమ్మ బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

**మాగనూరు, డిసెంబరు 19 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో వెలసిన శ్రీ బయట మారెమ్మ బోనాల ఉత్సవాలు మంగళ వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులంతా మధ్యాహ్న 2 గం.ల సమయంలో వాగులో వెలసిన ఆంజనేయస్వామి దర్శనం అనంతరం బోనాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ప్రతి వర్షాకాలం సంవత్సర పంటలను ముగించుకుని ధాన్యం ఇంటికి చేరుకునే సందర్భంగా డిసెంబర్ నెలలో మాగనూరు ఓబులాపూర్ గ్రామస్తులు సంయుక్తంగా అమ్మవారికి బోనాలతో మొక్కులు చెల్లించు కోవడం అక్కడి ఆనవాయితీని అన్య గ్రామ పెద్దలు తెలిపారు. అమ్మవారికి పొటేళ్లు, కోళ్లతో మొక్కు లు చెల్లించుకున్నారు. బోనాల ఉత్సవం సందర్భంగా ముంబై, సోలాపూర్, హైదరాబాద్, బెంగు ళూరు లాంటి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్సై మల్లేష్ ఆధ్వర్యంలోఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండాబందోబస్తు నిర్వహించారు.

## ఆకట్టుకున్న ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

**బిజినేపల్లి, డిసెంబరు19 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని మాస్టర్ మైండ్స్ స్కూల్ గ్రౌండ్‌లో సూనకల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డి పోటీలు మంగళవారం ఆకట్టుకున్నాయి. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని పలువురు అభిప్రాయపడ్డారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్ కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి రెండు జట్ల చొప్పున బాలుర, బాలికల 10జట్లు పోటీపడ్డాయి. పోటీల్లో గెలుపొందిన జట్లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయడంతో పాటు ఉత్తమ ప్రతిభన కనబర్చిన 12 మంది చొప్పున ఎంపిక చేసి ఉమ్మడి జిల్లా బాలుర, బాలిక జట్లను ఎంపికచేసి రాష్ట్రస్థాయిలో పోటీ పడేందుకు ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు మండల రైతు సమన్వయ సమితి కో ఆర్డినేటర్ నెల్లికంటి మహేశ్వర్‌రెడ్డి భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో పీఈటీలు రమేష్, నిరంజన్ యాదవ్, వెంకటయ్యలు పాల్గొన్నారు.



ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డి పోటీల్లో పోటీపడుతున్న జట్లు

# మేనరికం పెళ్లిళ్ల వలనే 50 శాతం అంగవైకల్యం కలుగుతుంది..

### అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు

**గద్వాల ప్రతినిధి డిసెంబర్ 19 ప్రభాతవార్త :** దివ్యాంగులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ చీర్ల శ్రీనివాసులు అన్నారు. మంగళవారం జిల్లాలో ఇండోర్ స్టేడియం నందు దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్ల సాధికారత శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మేనరికం పెళ్ళిళ్ల వలనే 50 శాతం అంగవైకల్యం కలుగుతుందని అన్నారు. డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం జరగాల్సి ఉండగా ఎన్నికలు ఉన్న సందర్భంగా ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. దివ్యాంగులు సామాజికంగా, శారీరకంగా, కుటుంబ పరంగా ఎలాంటి వివక్షతలకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. అంగ వైకల్యం ఉన్నంత మాత్రాన దివ్యాంగులు ఏ విషయంలో కూడా తక్కువ కాదని, మనసుంటే మార్గముంటుంది అనే విదంగా అవరోదాలను ఎదుర్కొని ముందెకు వెళ్లాలని అన్నారు. దివ్యాంగులు నిత్య చైతన్యవంతులుగా ఉండేందుకు ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను చేపడుతుందని తెలిపారు. దివ్యాంగుల



దివ్యాంగుల దినోత్సవం కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్

సాధికారత కోసం విద్య, ఉపాది, ఆరోగ్య భద్రత మౌళిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని, వారి కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా చెస్, క్యారమ్స్, షాట్ పుట్స్, 100మీ, 200 మీటర్ల పరుగు పందెం వంటి క్రీడల పోటీలలో దివ్యాంగులు



పరుగు పందెం పోటీలలో బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పాల్గొని గెలుపొందిన వారికీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీసీ.ఈ.ఓ కాంతమ్మ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి ముసాయిదా బేగం, జిల్లా క్రీడా అధికారి బి.ఎస్ ఆనంద్, డా.రాజు, డా. హేమలత, అందుల పాఠశాల విద్యార్థిని విద్యార్థుల, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎక్సైజ్ ఉన్నత అధికారులు

**ఉప్పునుంతల, డిసెంబరు 19 ప్రభాతవార్త :** పాఠశాలకు అతి దగ్గరలో వైన్‌షాపు ఉందని తమకు ఇబ్బంది ఏర్పడుతుందని పాఠశాల విద్యార్థుల ఫిర్యాదు మేంకు మంగళవారం నాగర్‌కర్నూల్ ఎక్సైజ్ ఏఈఎస్ సుధాకర్ ఆధ్వర్యంలో వైన్‌షాపు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. పాఠశాలకు వెళ్లినప్పుడు, ఇంటికి వెళ్లేటప్పుడు మందు ప్రియుల బెడద వల్ల తమకు ఇబ్బంది ఏర్పడుతుందని జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు చేశారు. విద్యార్థుల ఫిర్యాదు మేరకు నాగర్‌కర్నూల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సుధాకర్ పరిశీలించారు. పరిశీలించిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆ పాఠశాల ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. అదేవిధంగా వైన్ షాపులో ఉన్న స్టాకును పరిశీలించారు. వైన్ షాపులో అన్ని రకాల మద్యం విక్రయించాలని ఆదేశించారు. నాగర్‌కర్నూల్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సుధాకర్‌తో పాటు తెల్కపల్లి సిఐ బాలరాజు, ఎస్సై బాలవర్ధన్‌రెడ్డి, సిబ్బంది హనుమంత్‌రెడ్డి, శ్రీనివాసమూర్తిలు ఉన్నారు.




వైన్ షాపులో స్టాకును పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు



ఉప్పునుంతల హైస్కూల్ ఆవరణ ముందు పరిశీలిస్తున్న ఎక్సైజ్ ఉన్నత అధికారులు

## బాధిత కుటుంబాలను ఆదుకుంటాం : మంత్రి జూపల్లి

**పాన్‌గల్, డిసెంబర్19, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన యువకుల కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని రాష్ట్ర ఎక్సైజ్ అండ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.మంగళవారం జిల్లా ఆస్పత్రిలో మృతి దేహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకుల మృతి బాధాకరమన్నారు.కుటుంబాలను పోషించే స్థాయిలో ప్రమాదానికి గురై మృతి చెందడం తల్లిదండ్రులను తీరని లోటు అన్నారు. అధైర్యపడవద్దని కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని భరోసా కల్పించారు ప్రమర్శించిన వారిలో మంత్రి వెంట మాజీ ఎంపీపీ వెంకటేష్ నాయుడు మాజీ జెడ్పిటిసి రవికుమార్ సర్పంచ్ లు వెంకటయ్య యాదవ్ జయరాములు సాగర్ కాంగ్రెస్ నాయకులు పుల్లారావు బ్రహ్మయ్య దశరథ్ సింగోటం వెంకటయ్య ఉన్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

## ఉజ్జయిని మహంకాళేశ్వర స్వామిని దర్శించుకున్న ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు



ఆలయంలో మొక్కు చెల్లించుకుంటున్న నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, పలువురు.

**కల్వకుర్తి, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒక్కంటైన ఉజ్జయిని మహాంకాళేశ్వర స్వామి దర్శనాన్ని మంగళవారం ఉదయం ప్రత్యేక సమయంలో నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ స్వామిని వారిని దర్శించుకొని మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా బచ్చు రామకృష్ణ మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టినందుకు స్వామి వారిని దర్శించుకున్నట్లు తెలిపారు. స్వామి వారిని దర్శించుకున్న వారిలో పెద్దాపూర్ కొమ్మగోని శ్రీనివాస్‌గౌడ్, వ్యాపారవేత్త వీరబొమ్ము వేణుగోపాల్ ఉన్నారు.

## తైక్వాడో పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బొక్కల అమ్ములు

**వెల్దండ, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మాడల్ పాఠశాలకు చెందిన విద్యార్థిని బొక్కల అమ్ములు నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి నిజామాబాద్ జిల్లాలో జరగబోయే తైక్వాడ్ ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపికైనట్లు మాస్టర్ చందు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా గద్వాల్‌లో జరిగిన తైక్వాడో పోటీల్లో అమ్ములు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. వెల్దండ మండల కేంద్రానికి చెందిన బొక్కల అమ్ములు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంపట్ల పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## బైకును ఢీకొన్న డీసీఎం

### ఇద్దరి యువకుల మృతి, ఒకరికి తీవ్ర గాయాలు




రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకులు గడ్డం, శివ గడ్డం రాంబాబు (ఫైల్)

**పాన్‌గల్, డిసెంబర్ 19, ప్రభాతవార్త:** ద్విచక్ర వాహనం డీసీఎం ఎదురెదురుగా ఢీకొ నడంతో ఇద్దరు యువకులు మృతిచెందగా ఒక యువకునికి గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది హెడ్ కానిస్టేబుల్ రామ్ చందర్ తెలి పిన వివరాల మేరకు వనపర్తి జిల్లా పాన్‌గల్ మండల పరిధిలోని దవాజి పల్లి గ్రామానికి చెందిన గడ్డం శివ (19) గడ్డం రాంబాబు (22) శ్రీకాంత్ లు సోమవారం రాత్రి ద్విచక్ర వాహ నం బలంగాఢీకొనడంతో గడ్డంశివ అక్కడికక్కడే మృతి చెందగా రాం బాబు శ్రీకాంత్‌లను 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలిం చారు ప్రథమ చికిత్స అనంతరం గడ్డంరాంబాబును మహబూబ్‌నగర్ ఆసు పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు శ్రీకాంత్ పరిస్థితి విషమంగా ఉండడంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు జరిగిన సంఘటనపై మృతిని తండ్రి గడ్డం రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకునిదర్యాప్తు జరుపుతున్నట్లుహెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

## గ్రామ అభివృద్ధి సహకరించండి



గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ శాంతమ్మ

**పాన్‌గల్, డిసెంబర్ 19, ప్రభాతవార్త:** గ్రామాల్లో చేసే అభివృద్ధికి ప్రజలు సహకరించాలని గ్రామాన్ని పరిశుద్ధంగా ఉంచాలని, సర్పంచ్ శాంతమ్మ అన్నారు.మంగళవారం మండల పరిధిలోని తెల్లరాలపల్లి తండాలో గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో పనిచేసే ప్రతికూలికి పనులు కల్పించాలని గ్రామ అభివృద్ధికి ప్రజలు సహకరించలన్నారు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరి మీద ఉందని ఆమె గుర్తు చేశారు.గ్రామాల్లో పని చేసే ప్రతికూలికి పనులు కల్పించాలని కోరారు.గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామ పంచాయతీలు చేసిన పనులను బిల్లులు చెల్లించాలి కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బుజ్జమ్మ పంచాయతీ కార్యదర్శి నర్మదా ఏఎన్ఎం సరళ టెక్నికల్ అసిస్టెంట్ సునీల ఫీల్డ్ అసిస్టెంట్ సోమ్లా ఆశ అంగన్వాడీలు ఉపాధ్యాయులు బిచ్చ నాయక్ మహిళా సంఘం అధ్యక్షురాలు చిట్టెమ్మ పాల్గొన్నారు.

## కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ వర్ధంతి వేడుకలు

**నారాయణపేట ప్రతినిధి, డిసెంబరు19 ప్రభాతవార్త :** ముదిరాజ్ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు, స్వాతంత్ర సమర యోధులు, ప్రముఖ రచయిత, పాత్రికేయులు విద్యావేత్త బహుముఖ ప్రజ్ఞశాలి, వివిధ సంఘాల వ్యవస్థాపకులు హైదరాబాద్ నగర తొలి మేయర్ కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ 56వ వర్ధంతి సందర్భంగా కృష్ణస్వామి నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం మాగనూరు మండలం మందిపల్లి గ్రామం ముదిరాజ్ జెండా కట్ట దగ్గర కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి వారు చేసిన సేవలను స్మరించుకున్న మాగనూరు మండలం ముదరాజ్ సంఘం ఉపాధ్యక్షులుకావలి విష్ణు ముదిరాజ్,మందిపల్లి గ్రామ ఉపాధ్యక్షులు గంప నరసింహులు ముదిరాజ్, మక్తల్ నవీన్ ముదిరాజ్, మక్తల్ ఆంజనేయులు, గంప నరేందర్ ముదిరాజ్, గంప దేవరాజ్, వాకిటి కృష్ణ ముదిరాజ్,గంప బలరాం ముదిరాజ్, గ్రామయువత పెద్దఎత్తున ముదిరాజ్ బంధువులు పాల్గొన్నారు.



కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ వర్ధంతిని నిర్వహిస్తున్న దృశ్యం

## రూ.9449 ధర పలికిన కింటాల్ కందులు

**దేవరకద్ర, డిసెంబరు 19 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయమార్కెట్ యార్డుకు మంగళవారం రైతులు 8 కింటాళ్ళ కందులను రైతులు విక్రయానికి తీసుకవచ్చారు.వీటికి అత్యధికంగా కింటాలకు రూ.9449 ధర పలికింది.అతి తక్కువగా రూ.9279 ధరపలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## 21న పాలెంలో రైతు సదస్సు

**బిజినేపల్లి, డిసెంబరు19 ప్రభాతవార్త:** పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో గురువారం రైతు సదస్సు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పరిశోధన కేంద్రం ఏడిఆర్ డా. మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.యాసంగి, వేరుశనగ, వరి, మొక్కజొన్న పంటలపై అవగాహన కార్యక్రమం, వ్యవసాయానికి సంబంధించిన అంశాలపై రైతులు,శాస్త్రవేత్తలకు చర్చా కార్యక్రమం ఉంటుందన్నారు.కార్యక్రమంలో వ్యవసాయవిశ్వవిద్యా లయంఅధికారులు,శాస్త్రవేత్తలు పాల్గొంటారనిరైతులుఅధిక సంఖ్యలో పాల్గొనిఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



అయ్యప్ప ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న స్వాములు

**బిజినేపల్లి, డిసెంబరు 19 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని గురుస్వామి శ్రీనివాసులు ఇంట్లో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక పూజలతో కాలనీ అయ్యప్ప నామస్మరణ మధ్య ఓలలాడింది. ఇండ్ల శ్రీనవాసులు గురుస్వామి అయ్యప్ప స్వాములతో కలసి ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప ఆలయ ప్రధాన అరచకులు నరసింహులయ్య, గణపతి, సుబ్రమణ్య ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృత అభిషేకం నిర్వహించి అర్చన, అష్టోత్తర శతామావళి జరిపారు. పదునెట్టింబడి ప్రత్యేక పూజలను నిర్వహించిన గురుస్వామి అయ్యప్ప స్వాములచే కర్పూర హారతులను అందించారు. ప్రత్యేక పూజల్లో పులేందర్‌రెడ్డి, సురేందర్, కుమ్మరి శ్రీను, కుమ్మరి రాజు, భాను ప్రకాష్‌రెడ్డి, తుమ్మల వెంకటయ్య, గుబ్బరవి, ఈర్ల శ్రీకాంత్, నరేందర్ తదితర అయ్యప్ప మాలధారణ స్వాములు ఉన్నారు.

## మొక్కులు చెల్లించుకున్న కాంగ్రెస్ నేతలు



జేపీ దర్గాలో మొక్కులు చెల్లించుకుంటున్న కాంగ్రెస్ నేతలు

**కల్వకుర్తి, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యేగా కసిరెడ్డి నారాయణరెడ్డి విజయం సాధించడంతో షాద్‌నగర్ నియోజకవర్గంలోని జేపీ దర్గా వద్ద మంగళవారం ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి చదర్ దట్టీ సమర్పించి ఫాతిహా కార్య క్రమాలు చేపట్టారు. మొక్కులు చెల్లించుకున్న వారిలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నంభూపతిరెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సంజీవకుమార్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ షాన్ వాజ్ ఖాన్, జీయగూడ యాదవ సంఘం అధ్యక్షులు జక్కుల చిన్న జంగయ్యయాదవ్, ఉప సర్పంచ్ అలీ, రమేష్‌యాదవ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## ఎర్రవెల్లి గ్రామ గౌడ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక



**వెల్దండ, డిసెంబర్19 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎర్రవెల్లి గ్రామ గౌడ సంక్షేమ సంఘం నూతన కమిటీని మంగళవారం మండల కేంద్రంలో గౌడ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు మట్ట వెంకటయ్యగౌడ్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షులుగా పబ్బు పెద్దయ్యగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శేఖర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా పర్వతాలు గౌడ్, రామచంద్రయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు గౌడ్,కార్యదర్శిగా వెంకటయ్యగౌడ్, కోశాధికారులుగాపబ్బు రాజు గౌడ్, అభిలాష్‌గౌడ్, సంయుక్త కార్యదర్శిగా పెద్దయ్యగౌడ్, ప్రచార కార్యదర్శులుగా వెంకటయ్యగౌడ్, శ్రీకాంత్‌గౌడ్, కార్యవర్గ సభ్యులుగామహేష్‌గౌడ్‌లను ఎన్నుకున్నారు.నూతనంగా ఎన్నికైన గౌడ సంక్షేమ సంఘాన్ని మండల అధ్యక్షులు మట్ట వెంకటయ్య గౌడ్, ఉపాధ్యక్షులు తిర్మన్‌దాస్ నాగరాజుగౌడ్ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

## 20న జిల్లా స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ సెలక్షన్

**వనపర్తి టౌన్, డిసెంబర్19, ప్రభాతవార్త:** 9వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఛాంపియన్ షిప్ 2024 కొరకై షిప్ 2024 కొరకై సెలెక్షన్స్ వనపర్తి లోని డాక్టర్ బాలకృష్ణయ్య క్రీడా ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు ప్రారంభం అవుతాయి అని మంగళవారం నాడు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు వాకిటీ శ్రీధర్ తెలిపారు.

# పార్టీలకతీతంగా మక్తల్ అభివృద్ధికి కృషి

**సమావేశాలకు అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి**
**మక్తల్ గ్రామ పంచాయతీ నుంచే రాజకీయ ప్రస్థానం ప్రారంభం**
**సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి**

**నారాయణపేట ప్రతినిధి, డిసెంబరు19 ప్రభాతవార్త:** ఢిల్లీ వేదికగా అత్యవసర సమావేశానికి హాజరు కావలసి ఉన్న మక్తల్ జాతరకు అత్యంత ప్రాముఖ్యత ఇచ్చి ఢిల్లీ టూరును రద్దు చేసుకుని మరీ మక్తల్ మున్సిపల్ సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చానని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తెలిపారు.మున్సిపల్ ఛైర్‌పర్సన్ పావని మల్లికార్జున్ అధ్యక్షతన జరిగిన మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారిమున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించడంతో కౌన్సిల్ సభ్యులు, అధికారులు, సిబ్బంది ఎమ్మెల్యేను శాలువా కప్పి సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అజెండాలో భాగంగా 11 అంశాలపై చర్చ జరగగా చివరి అంశమైన 11వ అంశం మినహా మిగతా పది అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు,సివిల్ శానిటేషన్ పనుల కోసం రెండు లక్షలు, గుంతలు పూడ్చేందుకు50 వేల ట్రాక్టర్ రిపేరు కోసం లక్ష, రోడ్ స్వీపింగ్ మిషన్ రిపేరు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

కోసం 20వేల, మోటార్ల పైప్‌లైన్ లీకేజీల రిపేరు కోసం 2 లక్షలు, పనిముట్ల రిపేర్ కోసం85వేలు, స్టేషనరీ కోసం50 వేలు జాతర సందర్భంగా టాయిలెట్ల ఏర్పాటు కోసం 2.5 లక్షలు ఖర్చు చేసేందుకు ఆమోదముద్ర వేశారు. అనంతరం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ 2001లో 26 ఏళ్ల వయులో మక్తల్ గ్రామ పంచాయతీకి సర్పంచ్‌గా ఎన్నికయ్యానని ఇక్కడి నుంచి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందని గుర్తు చేసుకున్నారు. తన హయాంలో టిడిపికి చెందిన ఎల్లారెడ్డి మినిస్టర్‌గా ఎంపిపిగా బిజెపికి చెందిన కొండయ్య, సర్పంచ్‌గా కాంగ్రెస్‌కు చెందిన తాను కలిసి పనిచేశామని అన్నారు. మక్తల్ పట్టణ వాసిగా తాను ఎమ్మెల్యేగా ఆయన పార్టీలకతీతంగా అన్ని వార్డు సభ్యులకు తనవంతుగా తన విధుల నుంచి అభివృద్ధి కోసం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. మక్తల్ జాతర సందర్భంగా పడమటి ఆంజనేయస్వామికి పట్టు వస్త్రాలు సమర్పించే సాంప్రదాయం తాను ప్రారంభించామని మున్సిపల్ ఛైర్మన్‌గా ఎన్నికైన వ్యక్తి ఈ సంప్రదాయాన్ని కొనసాగించాలని సూచించారు. కనివిని ఎరుగని రీతిలో మక్తల్ జాతరను బ్రహ్మాండంగా జరుపుకుందామని సూచించారు. మున్సిపాలిటీ సమావేశాలకు అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, ప్రతి ఒక్కరికి తెలియజేయాలని తర్వాత సమావేశాలకు రాకపోతే వారిపై చర్యలు తీసుకునే విధంగా చేపట్టాలని కమిషనర్‌కు సూచించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు తమ వార్డులలో సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశానికి ఇద్దరు వార్డు కౌన్సిలర్లు మినహా 14 మంది హాజరయ్యారు. సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ అఖిల రాజశేఖర్‌రెడ్డి, కమిషనర్ బలరాంనాయక్, ఏఈ నాగశివ, వార్డు కౌన్సిలర్లు రాధికా శేషగిరి, గొల్లపల్లి శంకరమ్మ, ప్రసన్న, కర్ని లక్ష్మీ, ఈసరి కౌసల్య, అర్చన, చీరాల సత్యనారాయణ, మొగులప్ప, రాములు, శ్వేత, ఇర్ఫానా సుల్తానా, సిబ్బంది తిమ్మప్ప, టౌన్ ప్లాన్ కిరణ్, స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## రైస్ మిల్లర్లు సిఎంఆర్ బియ్యాన్ని సకాలంలో అందజేయాలి

◆నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష


రైస్‌మిల్లు యజమానులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి, డిసెంబరు19 ప్రభాతవార్త:** రైస్‌మిల్లర్లు సిఎంఆర్ బియ్యాన్ని సకాలంలో అందజేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష రైస్‌మిల్లు యజమానులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశించిన ప్రకారంగా రైస్ మిల్లర్లు నడుచుకోవాలని అన్నారు. ప్రభుత్వనికి అందించే సీఎంఆర్ బియ్యం సకాలంలో అందజేయాలన్నారు. లేని ఎడల కఠినచర్యలు ఉంటాయన్నారు. సమావేశంలో డిఎస్ఓ డిఎం రైస్‌మిల్ యజమానులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను సన్మానించిన కేఎన్ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షులు



**కల్వకుర్తి, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** తెలంగాణలో అత్యంత వెనుకబడ్డ కల్వకుర్తి నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక చొరవతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు కేఎన్ ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షులు మెకానిక్ బాబా అన్నారు. బ్రిలియంట్ విద్యా సంస్థల అధినేతగా ఆర్థికంగా ఉన్నతంగా ఎదిగిన కసిరెడ్డి నారాయణ రెడ్డి నిస్వార్థంగా ప్రజాసేవకై రాజకీయాల్లోకి వచ్చి మచ్చలేని నేతగా గుర్తింపు పొందినట్లు ఆయన పేర్కొన్నారు. కసిరెడ్డి నారాయణరెడ్డికి తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్‌లో మంత్రిగా స్థానం దక్కనున్నట్లు వెలువడుతున్న ప్రచార నేపథ్యంలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో మంత్రి వర్గ విస్తరణలో ఎమ్మెల్యే కసిరెడ్డి చోటు దక్కించుకొని కల్వకుర్తి అభివృద్ధికి పాటు పడాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## బాధిత కుటుంబానికి చెక్కు అందజేత




**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా మున్సిపాలిటి పరిధిలోని ఎండబెట్ల గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ప్రధానోపాధ్యాయుడు బిచ్చారావు ఎస్‌బీఐ ఎస్‌జీ ఎస్ పీ ఖాతాలో ప్రమాద బీమాను చేసుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు మంజూరైన రూ.15లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా జోగు లాంబ రీజినల్ మేనేజర్ వెంకటరమణ మాట్లాడుతూ మంగళవారం ఎస్‌బీఐ నాగర్‌కర్నూల్ మెయిన్ బ్రాంచ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బాధిత కుటుంబానికి చెక్కు అందించామన్నారు. అదే విధంగా స్టేట్ గవర్నమెంట్ సాలరీ ప్యాకేజీ ఎస్‌జీ ఎస్‌పీ ఖాతా క్రిందకు మారితే ఖాతా దారులకు ప్రయోజనాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో శాఖ నిర్వాహక అధికారి కే.గురుప్రసాద్, శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**వెల్దండ, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన జాతీయ రహదారిపై రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం ఆర్కపల్లి గ్రామానికి చెందిన దూదేకుల జహంగీర్ (36) ప్రమాదానికి గురై మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించి సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## కొత్త ఓటరుగా నమోదు చేయించుకోండి

**వీపనగండ్ల,డిసెంబర్ 19,ప్రభాతవార్త :** జనవరి 1 2024 సంవత్సరానికి 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు ఓటరుగా నమోదు చేయించుకోవడానికి ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చిందని వీపనగండ్ల మండల తహసీల్దార్ వరలక్ష్మి తెలియజేశారు.ఈ అవకాశాన్ని జనరవి 5 తేదీలోపు ఓటరుగా నమోదు చేసుకోవాలని చెప్పారు.ఈ అవకాశాన్ని 18 సంవత్సరాలు నిండిన అన్ని గ్రామాల యువతి,యువకులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

## సోషల్ వెల్ఫేర్ గురుకులంలో విద్యార్థుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**వెల్దండ, డిసెంబర్19 ప్రభాతవార్త:** సోషల్ వెల్ఫేర్‌లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం, 5వ తరగతి ప్రవేశాలకు అర్హులైన విద్యార్థినీ, విద్యార్థుల నుంచి ధరఖాస్తులు కోరుతున్నామని కళాశాల ప్రిన్సిపాల్ షేక్ షకీల సుల్తానా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం 2024–25కు గాను ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశానికై అర్హులైన విద్యార్థినీ, విద్యార్థుల నుంచి ధరఖాస్తులు కోరుతున్నారని, ఫీజు రూ.200లు చెల్లించి టీఎస్ డబ్ల్యూఆర్ఐఈఎస్‌లో వెబ్‌సైట్‌లో ధరఖాస్తు చేసుకోవాలని, జనవరి 15 చివరి తేదీ అని, 5వ తరగతికి గాను రూ.100లు ఫీజు చెల్లించి జనవరి 06 చివరి తేదీ వరకు గడువు ఉందన్నారు. ఆసక్తి గల విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# ఆటో కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**ఆట డ్రైవర్లను రెచ్చగొట్టేలా మాట్లాడడం మాజీ మంత్రికి తగదు : టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్ కుమార్**

**మహబూబ్‌నగ్ బ్యూరో, డిసెంబరు 19 ప్రభాతవార్త:** ఆటో కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్ అన్నారు.మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో, ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల ముందుకు తీసుకెళ్లామని, ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో గొప్ప విజయాన్ని అందించినట్లు తెలిపారు. ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగానే ఆర్టీసి బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి నట్లు తెలిపారు.కానీ ఈ పథకం వల్ల ఆర్టీసి కార్మికులకు కష్టం వస్తుందని బిఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో ఆటో కార్మికుల జీవనం దుర్భరంగా మారిందని, లాక్‌డౌన్‌లో ఆటో కార్మికులపై వేలాది కేసులు నమోదు చేసిన ఘనత అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందని ఎద్దేవా చేశారు.ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టేలా మాట్లాడడం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు తగదని అన్నారు. ఆటో డ్రైవర్లు ఆత్మ హత్యలు చేసుకుంటారంటూ మాజీ మంత్రి చెప్పడంసరికాదని,ఇది ఆత్మహత్యలను ప్రోత్సహించినట్లేనని దీనిపై మాజీ మంత్రియే బాధ్యత వహించాల్సి


సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

ఉంటుందన్నారు. ఆటో కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన టిఆర్ ఎస్ ప్రభుత్వం, వారికి చేసిందేమి లేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఆటో కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఏడాదికి రూ.12 వేల ఆర్థికసాయం అందిస్తామని, ప్రత్యేక సంక్షేమ బోర్డుతో వారికి అనేక వెసలుబాట్లు లభిస్తాయని తెలిపారు. ఆటో కార్మికులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని, వారికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని తెలిపారు.సమావేశంలో జిల్లా మీడియా సెల్ కన్వీనర్ సిజెబెనహర్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు రాములు యాదవ్, పట్టణాధ్యక్షుడు బాబుమియా,హాస్మిరాజు,రవి,ఖాదర్ పాల్గొన్నారు.

# న్యూమోనియా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

**మండల వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ**

**వీపనగండ్ల,డిసెంబర్ 19,ప్రభాతవార్త :** వీపనగండ్ల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మండల వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఆశా డే సమావేశం నిర్వహించారు.ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం గూర్చి వారు మాట్లాడుతూ...ఉమ్మడి మండల కేంద్రంలోని అన్ని గ్రామాలలో ఐదు సంవత్సరాలలోపు పిల్లల సర్వే నిర్వహించి ఎవరికైనా నిమోనియా వ్యాధి లక్షణాలు ఉన్నచో వారిని వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివరాలను నమోదు చేయాలని చెప్పారు.అదేవిధంగా చిన్నపిల్లలలో చలితో కూడిన వణుకు జ్వరము ఉంటుందని 101 డిగ్రీ ఫారిన్ హీట్ నుండి 105 డిగ్రీ ఫారిన్ తీవ్రత జ్వరం ఉంటుందని, దగ్గు, తెమడ వస్తుందని తెమడ లో రక్తపు మరకలు ఉంటాయని ఇవి న్యూమోనియా వ్యాధిలక్షణాలుగా గుర్తించి ఆసుపత్రికి తీసుకురావాలని ఆశ వర్కర్లకు తెలియజేశారు.నిమోనియా సర్వేగ్రామాలలో పకడ్బందీగా నిర్వహించి ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ఆసుపత్రిలో వివరాలు విధిగా నమోదు


న్యూమోనియ వ్యాధి నివారణ గురించి మాట్లాడుతున్న డాక్టర్ వంశీకృష్ణ

చేయాలని తెలియజేశారు.ఉమ్మడి మండలాల లోని గ్రామాలను న్యూమోనియా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా ఆశ వర్కర్లు, ఆసుపత్రి సిబ్బంది పనిచేయాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆయుష్. వైద్యులు,సూపర్వైజర్,ఆశవర్కర్లు,మరియుఆసుపత్రిసిబ్బంది పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలి

**- కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ అధ్యక్షులు లీలా లక్ష్మారెడ్డి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్19 ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు పాలు పంచుకోవాలని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ అధ్యక్షులు లీలా లక్ష్మారెడ్డి అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి రోజు ప్రతి ఒక్కరు కష్టపడాలన్నారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యూకేషన్ తెలంగాణ ప్రభుత్వం మరియు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రేవాల్యూషన్ వారి సౌజన్యంతో తెలంగాణ రాష్ట్రంలోని నాగర్‌కర్నూల్ జిల్లాలో 10 పాఠశాలల్లో యంగ్ ఎర్త్ లీడర్ పైలట్ ప్రాజెక్టు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్ద కొత్తపల్లిలో యంగ్ ఎర్త్ లీడర్ అనే అంశంపైన విద్యార్థులకు మరియు ఉపాధ్యాయులకు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ అధ్యక్షులు లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మనందరం భూమికి లీడర్లుగా ఉంటూ భూమిపై ఉన్న ప్రతి వస్తువును రక్షించుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉంది. మరియు మన వనరులను రక్షించుకొని భావి తరాలకు అందించే విధంగా ఉంఆలని, మన పాఠశాల ఆవరణలో మనకు జీవితంలో అవసరమయ్యే ఔషధ మొక్కలు నాటి మన జీవితాన్ని సుఖమయం చేసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ప్రకృతిని కాపాడుకొని పుడమి తల్లిని రక్షించుకుందామన్నారు. జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ భూమి కాలుష్యాన్ని, గాలి కాలుష్యాన్ని మరియు నీటి కాలుష్యాన్ని నివారించడానికి మన వంతు కర్తవ్యం మనం నిర్వర్తించాలన్నారు. నేలతల్లిని సుభిక్షంగా ఉంచగలిగితే ఏ కాలుష్యమైన నివారించవచ్చునన్నారు. కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ జగన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మద్దిలేటి, ఇతర ఉపాధ్యాయులు, సభ్యులు తదితరులు ఉన్నారు.


పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

# పెన్షన్ పంపిణీలో ఇబ్బందులు కలిగించొద్దు

**ప్రీ మెట్రిక్స్ స్కాలర్‌షిప్‌లు అందజేయాలి**
**సీజనల్ వ్యాధులను నివేదిక తయారు చేయాలి**
**సమీక్షలో మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ రవినాయక్**

**మహబూనగర్ బ్యూరో, డిసెంబరు19 ప్రభాతవార్త:** ఆసరా పెన్షన్ పొందుతూ మరణించిన కేసులలో భాగస్వామికి ఇచ్చే పెన్షన్ త్వరతగతిన మంజూరు చేయడంపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ జి. రవి నాయక్ గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులను ఆదేశించారు. పెన్షన్ పొందుతూ చనిపోయిన కేసులకు సంబంధించి తక్షణమే డెత్ సర్టిఫికెట్ తెప్పించి జీవిత భాగస్వామికి పెన్షన్ ఇచ్చేలా చూడాలన్నారు. ఈ విషయంలో జడ్పీ సీఈఓ అన్ని మండలాల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షించాలని అలాగే మున్సిపాలిటీలలో కమిషనర్లు సైతం తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం ఐడిఓసిలో నిర్వహించిన జిల్లా అధికారుల సమ్మిళిత సమావేశంలో ఆయన వివిధ అంశాలపై జిల్లా అధికారులతో సమీక్షించారు. గిరివికాసం కింద మంజూరు చేసిన బోర్లకు తక్షణమే మోటార్లు బిగించి వారికి ఉపయోగపడేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. గత సంవత్సరంలాగే ఈ సంవత్సరం సైతం అర్హులైన ప్రీ మెట్రిక్ విద్యార్థులందరికి సకాలంలో ఉపకార వేతనాలు అందేలా ప్రత్యేక అధికారులు, సంక్షేమ, విద్యాశాఖ అధికారులు చొరవ చూపాలని, అర్హత ఉన్న విద్యార్థు జాబితాను సమర్పించాలని అన్ని స్థాయిల్లో ఈ అంశంపై సమీక్షించాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీలలో విద్యుత్ బిల్లులను నిర్దేశించిన సమయంలో చెల్లించేందుకు టిఎస్ఎస్‌పిడిసిఎల్ అధికారులు సకాలంలో బిల్లులను జనరేట్ చేసి జిల్లా పంచాయతీ అధికారికి పంపాలని,డిపిఓ బిల్లులన్నింటిని సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణంలో భాగంగా జిల్లాలో మొత్తం 147 గ్రామ పంచాయతీ భవనాలు పురోగతిలో ఉండగా, 43 పూర్తికావడం జరిగిందని పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరేందర్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌కు తెలుపగా పూర్తయి ఇంకా ప్రారంభించని వాటిని గుర్తించి వాటిని ప్రారంభం చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. సీజనల్ వ్యాధులు, జ్వరము ఇతర వ్యాధులకు సంబంధించిన వివరాలను ప్రతిరోజు తనకు నివేదిక సమర్పించాల్సిందిగా జిల్లా వైద్య



మాట్లాడుతున్న కలెక్టర్ జి. రవినాయక్

ఆరోగ్య శాఖ అధికారి డా.కృష్ణ ఆదేశించారు. ఈ ఆఫీసులో పెండింగ్‌లో ఉన్నఅన్ని ఫైళ్లను అన్ని శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, పరిష్కారం సైతం గుణాత్మకంగా ఉండాలని తెలిపారు. ధాన్యం కొనుగోలుకు ఆన్‌లైన్ నమోదు జాప్యం లేకుండా చూడాలని, అదేవిధంగా ట్రక్‌షీట్ జనరేషన్‌లో సైతం జాప్యం జరగకుండా చూసుకోవాలని తెలిపారు. జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటి వరకు51,665 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల లబ్దిదారులకు సంబంధించిన వివరాలు మండలాల నుండి తెప్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో భాగంగా ఆయా శాఖల అధికారులు వారి పరిధిలోని భూములను పరిరక్షించే చర్యలను చేపట్టాలని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీ వారిగా అనుమతించిన లే అవుట్లు, అనుమతి లేని లే ఔట్లకు సంబంధించి ప్రజలకు ఉపయోగపడే ఓపెన్ స్థలాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించి సమర్పించాలని అన్నారు. పట్టణాలు, గ్రామ పంచాయతీలలో చెరువులు శిఖం భూములలో నిర్మించుకున్న నిర్మాణాలకు సంబంధించి ఇరిగేషన్ శాఖ ద్వారా ఇచ్చే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ జారీలో పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా గత నాలుగైదు సంవత్సరాల కింద అనుమతులు ఇచ్చినవన్నింటిని మరోసారి తనిఖీ చేయాలని, వచ్చే జిల్లా అధికారుల సమావేశం నాటికి కార్యాచరణ ప్రణాళిక సమర్పించాల్సిందిగా ఆయన ఆదేశించారు. స్థానిక సంస్థల శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, డిఆర్ఓ కేవివి రవికుమార్, జిల్లా అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# జాతీయ లోక్ అదాలత్

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ



**నారాయణపేట ప్రతినిధి, డిసెంబరు 19 ప్రభాతవార్త:** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన లోక్ అదాలత్‌ను ఉద్దేశించి జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ మాట్లాడారు. డిసెంబర్ 30నజాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు న్యాయమూర్తి తెలిపారు. లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకుంటే కేసులు త్వరగా పరిష్కారమై సత్వర న్యాయం అందుతుందని తెలిపారు. మంగళవారం కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రీ సిట్టింగ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజీమార్గం ద్వారా అధిక సంఖ్యలో సమస్యలు పరిష్కారం చేయాలని కోర్టులో ఇది వరకు పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రజలు 30న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని తమ కేసు సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.ఈ సందర్భంగా నారాయణపేట జిల్లా అన్ని పోలీస్ స్టేషన్లునారాయణపేట, మాగనూరు,మద్దూరు, దామరగిద్ద, ఉట్కూర్, కోస్గి, ధన్వాడ, మక్తల్, కృష్ణ, ఇతర స్టేషన్లలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని మొత్తం12 పోలీస్ స్టేషన్ పరిధిలో అన్ని కలిపి 10 వేల కేసులను టార్గెట్‌గా ఆయన నిర్దేశించారు. అన్ని పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్నకేసులు క్లియర్ చేయాలన్నారు. సమావేశంలో న్యాయమూర్తులు జి. శ్రీనివాస్, మహ్మద్ ఉమర్, సయ్యద్ జకియా సుల్తానా, ఎస్పీ యోగేష్ గౌతమ్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ కె. లక్ష్మీపతిగౌడ్, దత్తాత్రేయ, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## దేవుడి సొమ్ముతో వైభోగమా?

-సన్మానాల పేరుతో ఆంజనేయస్వామికి శఠగోపం...
-ఆలయ భూములను సర్వే చేసి బోర్డులు ఏర్పాటు చేస్తాం...
-కబ్జా భూములను వెనక్కి తీసుకుంటాం : ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి



**ఊర్కొండ, డిసెంబర్19 ప్రభాతవార్త:** దైవ దర్శనాలకు వెళ్లి సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించాల్సిన పాలకులు అధికార మదంతో తనతో పాటు తన వెంట ఉన్న అనుచరగణానికి కూడా ఆలయ సొమ్ముతో అంగు అర్భాటాలను ఏర్పాటు చేసి సన్మానాలు చేయకపోతే దేవాదాయ శాఖ అధికారులపై విరుచుకుపడి పాలనకు విరుద్ధంగా దేవుడి సొమ్ముతో హంగామా సృష్టించిన పాలకులపై జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ధ్వజమెత్తారు.మంగళవారం మండలంలోని ఊర్కొంపేట ఆంజనేయస్వామి సన్నిధిలో ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారి శ్రీనివాస రెడ్డి, తహసీల్దార్ చెన్న కిష్టయ్య, డీటీ శ్రీనివాస్‌లతో ఎమ్మెల్యే పలు విషయాలపై చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆలయ సొమ్మును కాజేసిన అక్రమార్కులను వదిలి పెట్టే ప్రసక్తే లేదని, ప్రతి పైసాను కక్కిస్తామని తెలిపారు. దేవాలయాల భూములను కాపాడి కట్టుదిట్టమైన భద్రత కల్పించాల్సిన పాలకులే తన అనుచరు గణంతో కలిసి అందిన కాడికి దోచుకున్న విధంగా ఊర్కొండ పబ్బతి ఆంజనేయస్వామికి శటగోపం పెట్టి అందిన కాడికి దండుకొని కబ్జాలు చేసిన మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వర్గీయులను వదిలి పెట్టేది లేదని ఆయన హెచ్చరించారు. దేవుడి సొమ్మును ఆక్రమించి ఖజానాను పెంచుకున్న అవినీతి పాలకుల భరతం పడుతానని ఆయన పేర్కొన్నారు. కబ్జాకు గురైన దేవాలయాల భూములను రక్షించేందుకు ప్రత్యేక సర్వేను ఏర్పాటు చేసి దేవాలయాల భూముల్లో హద్దులు ఏర్పాటు చేసి ఆంజనేయస్వామికి దక్కాల్సిన భూములనుఅందిస్తానని ఆయన పేర్కొన్నారు.ఊర్కొండ పేట ఆంజనేయస్వామి దేవాలయ ఆదాయ లెక్కలను వారం లోపు తేల్చి పూర్తి నివేధికను అందించాలని ఆదేశాలు జారీ చేశారు.దేవాలయ అధికారులు అందించాల్సిన నివేధికలో ఎలాంటి ఆలస్యం లేదా తప్పుడు నివేధికలను సృష్టిస్తే సహించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇక నుంచి స్వామి వారి దర్శనాలకు వచ్చే వారికి కండువాలు,శాలువాలు కప్పడం, తీర్థప్రసాదాలు అందించడం మానుకోవాలని, స్వామి వారి దర్శనం కోసం వచ్చే ప్రతి ఒక్కరిని భక్తులుగా గౌరవించడం అలవర్చుకోవాలన్నారు. ఆలయ సొమ్ముతో అంగు అర్భాటాలు చేయడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## ప్రతి కార్యకర్తకు రుణపడి ఉంటా..

**-జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి**

**ఊర్కొండ, డిసెంబర్19 ప్రభాతవార్త:** జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నిరంతరం నా గెలుపుకు కృషి చేసిన ప్రతి కార్యకర్తకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యేగా అనిరుధ్‌రెడ్డి గెలుపొందితే రేవల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అయ్యూబ్‌పాష కాలి నడకన వచ్చి ఆంజనేయస్వామిని దర్శించుకుంటానని మొక్కుకున్నారు. మంగళవారం అయ్యూబ్ పాష మొక్కు చెల్లింపులో భాగంగా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్, మాధారం గ్రామ సర్పంచ్ ధ్యాప నికిల్‌రెడ్డితో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అయ్యూబ్‌పాషతో కలిసి కాలి నడకన ఊర్కొండ మండలంలోని ఊర్కొండ పబ్బతి ఆంజనేయస్వామికి బయలుదేరారు. ఊర్కొండ మండల కేంద్రానికి చేరుకొని అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాదయాత్రగా వస్తున్న ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని పార్టీ కోసం, నా గెలుపు కోసం ఎంతో కష్టపడి పనిచేశారని, నియంత పాలనలో అదరకుండా, బెదరకుండా నమ్ముకున్న జెండాను విడువకుండా అహర్నిశలు పార్టీ కోసం పనిచేసి భారీ మెజార్టీతో గెలిపించిన ప్రతి కార్యకర్తకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడి ప్రజలందరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని, ప్రజల నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా ప్రజలందరికి సురక్షితమైన ప్రజా పాలనను అందించి ప్రజల సేవకుడిగా ఉంటానని ఆయన అన్నారు. జడ్చర్ల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించి నమ్మిన కార్యకర్తలు, ప్రజలను ఒమ్ము చేయకుండా కలిసి కట్టుగా పనిచేసి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పర్చుకుందామని ఆయన పిలుపునిచ్చారు. మండలానికి విచ్చేసిన ఎమ్మెల్యేను గజమాలతో కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలోఊర్కొండ కాంగ్రెస్‌కార్యకర్తలు, నాయకులు తదితరులు ఉన్నారు.


ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే...


ఎమ్మెల్యేను గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

## చెట్లను నరకొద్దంటూ చెట్టెక్కి విద్యార్థి నిరసన

**రామచంద్రాపురం, డిసెంబరు 19, ప్రభాతవార్త:** ప్రకృతిని కాపాడాలని, జీవరాసులకు ఆక్సిజన్ అందించే చెట్లను నరకొద్దంటూ విద్యార్థి నూతన రీతిలో నిరసన వ్యక్తం చేసిన సంఘటన మంగళవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాకతీయనగర్‌లో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళితే... కాకతీయనగర్ కాలనీకి చెందిన ప్రవీణ్ కుమారుడు బాలుడు అనిరుధ్ కాలనీలో రోడ్డు వెడల్పు కోసం చెట్లను తీసేసేందకు కాలనీ అసోసియేషన్ సభ్యులు, అటవీ శాఖ అధికారుల నుంచి అనుమతి అందుకుని చెట్లను నరికేందుకు కాంట్రాక్టరకు పనులు అప్పగించడంతో సదరు కాంట్రాక్టర్ చెట్లను నరికేందుకు సన్నదం అవుతున్న తరుణంలో 12 సంవత్సరాల బాలుడు అనిరుద్ చెట్లను నరకడాన్ని అడ్డుకుని చెట్లను నరకొద్దని, చెట్టలో మానవాళికి కలిగే ప్రయోజనాలపై వివరించారు. కాంట్రాక్టర్ చెట్లను నరికేందుకు యత్నించడంతో బాలుడు గబగబమంటూ చెట్టెక్కి నిరసన వ్యక్తం చేస్తూ 7 గంటలపాటు చెట్లుపై తిండి తిప్పలు లేకుండా కూర్చున్నాడు. చెట్లను నరకొద్దని అధికారులు ఉత్తర్వులు జారీ చేస్తేనే చెట్లును దిగుతానని అనురుధ్ భీష్మించుకు కూర్చున్నాడు. విషయం తెలుసుకున్న జీహెచ్ఎంసి అధికారులు,స్థానికులు సంఘటన స్థలానికి ఏరుకుని బాలుడిని నచ్చచెప్నే ప్రయత్నం చేశారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

### ఒక లక్షా 47 వేల రూపాయిలు స్వాధీనం

**నర్సాపూర్, డిసెంబర్ 19.ప్రభాతవార్త:** పేకాట ఆడుతున్న స్థావరం దాడి చేయగా 19 మంది పేకాట రాయుళ్లను పట్టుకోగా వారి వద్ద నుండి ఒక లక్షా 47 వేల రూపాయిలు లభించిన సంఘటన నర్సాపూర్ మండలంలోని నత్నాయపల్లి గ్రామ పరిధిలోగల వడ్డెర గూడెం అడవి ప్రాంతంలో చోటు చేసుకుంది. ఈ సంఘటన వివరాలు ఎస్ఐ శివకుమార్ కథనం ప్రకారం... నత్నాయపల్లి వడ్డెరగూడెం అడవి ప్రాంతంలో దండుగుల గోపాల్‌కు చెందిన రేకులషెడ్‌లో పేకాట ఆట ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు దాడులు చేశామని తులిపారు. ఈ దాడిలో అక్కడ పేకాట ఆడుతున్న 19 మందిని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశామని తెలిపారు. అంతేగాక ఈ పేకాట ఆడుతున్న స్థావరంలో ఒక లక్షా 47 వేల రూపాయిలు లబించాయని తెలిపారు. ఇట్టి నగదును స్వాదీనం చేసుకొని 19 మంది పేకాట రాయుళ్ళను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.ఎవరైనా అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శివకుమార్ హెచ్చరించారు.

## బస్సు డ్రైవర్‌పై దుర్భాషలాడిన వ్యక్తిపై కేసు నమోదు

**టేక్మాల్, డిసెంబరు 19, ప్రభాతవార్త:** ఓ బస్సు డ్రైవర్‌పై దుర్బాషలాడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు టేక్మాల్ ఎస్ఐ రమేష్ తెలిపారు. వివరాల్లోకి వెళ్లితే ఈ విధంగా ఉన్నాయి. సోమవారం సాయంత్రం మెదక్ డిపోకు చెందిన పల్లే వెలుగు బస్సు డ్రైవర్ దూదేకుల అస్లాం బొడ్మట్‌పల్లి నుండి మెదక్ వెళ్తుతుండగా సాలోజిపల్లి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల మోహన్ బస్సుకు అడ్డుగా ఒకర్రతో వచ్చి దుర్బాషలాడుతూ నిన్ను చంపుతాను అని బెదిరించడని ఫిర్యాదు పెర్కొన్నాడు. ఎందుకని ప్రశ్నించగా నాభార్య టేక్మాల్‌లో బస్సు అపితే అపలేవు కదరా అంటూ బూతుమాటలు ప్రయోగిస్తూ కర్రతో మీదకు వచ్చినట్లు ఆయన ఫిర్యాదులో తెలిపారు. అనవసరంగా ఎవరైనా గొడవలు పడిన విధులకు అటంక పర్చిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

## బొలేరా వాహనం బోల్తా..

**అల్లాదుర్గం, డిసెంబరు 19, ప్రభాతవార్త:** ఓవర్ లోడ్‌తో వెళుతున్న బొలెరో వాహనం బోల్తాపడిన సంఘటన కొందరు స్వల్పంగా గాయాలకు గురైన సంఘటన అల్లాదుర్గం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం... హైదరాబాద్ నుంచి నారాయణఖేడ్ వైపుకు స్టీల్ లోడ్‌తో వెళుతున్న బొలెరో వాహనం అదపుతప్పి పల్టీ కొట్టిందని, వాహనంలో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలకు గురయ్యారన్నారు. స్వల్పగాయాలతో బయటపడ్డ క్షత గాత్రులను 108వాహనంలో జోగిపేట ప్రభుత్వఆసుపత్రికి తరలించారు.

## మెగా రక్తదాన శిబిరం విజయవంతం

**సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** అలయన్స్ సిద్దిపేట జిల్లా గవర్నర్ సోమవనిజ ఆధ్వర్యంలో స్థానిక ఎన్ఎస్ఎస్ యూనిట్ ఇందూర్ ఇంజనీరింగ్ కాలేజీలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపల్ సహకారంతో ఫ్యాకల్టీస్, విద్యారులు 55 యూనిట్ల రక్త దానం చేశారు. సేకరించిన రక్తాన్ని హైదారాబాద్ జనని వాలంటీరీ బ్లడ్ సెంటర్‌కు పంపించారు. అనంతరం రక్తదానం చేసిన దాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ సోమ వనజ మాట్లాడుతూ విద్యార్థిదశ నుంచే సేవచేసే గుణం అలవర్చుకోవడం సంతోషంగా ఉంద న్నారు. ఇతరులకు రక్తదానం చేయడం ప్రాణాదానంతో సమానమన్నారు. అలయన్స్‌క్లబ్ సేవ కార్యక్రమాలలో ముందుంటుందన్నారు. కార్యక్రమంలో అలయన్స్‌క్లబ్ నాయకులు అత్మ రాములు, వైకుంఠం, అంజయ్య, రాజేశ్వర్‌రెడ్డి, సోమ శివకుమార్,రామచంద్రం, వెంకటలక్ష్మీ, మల్లేశం పాల్గొన్నారు.

## రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

### పిఏసిఎస్ చైర్మన్ రాజలింగారెడ్డి



రుణాలను అందజేస్తున్న పిఏసిఎస్ చైర్మన్ రాజలింగారెడ్డి

**మిరుదొడ్డి, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** వివిధరకాల రుణాలు తీసుకున్న రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మిరుదొడ్డి పిఏసిఎస్ చైర్మన్ లింగాల రాజలింగారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అందె గ్రామానికి చెందిన శంకర్, భాగవ్వలకు గేదెలు,మేకల పెంపకం కోసం ఒక్కక్క యూనిట్‌కు రూ.500000 చొప్పున 1000000 దుబ్బాక బ్రాంచ్ మేనేజర్ మహేందర్‌రెడ్డితో కలిసి అందజేశారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకొని అర్థికం ముందుకు రావాలన్నారు. బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే తిరిగి రుణాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. కార య్రక్రమంలో సీఈఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి రజక సంఘం ఆర్థిక సహాయం

**జగదేవ్‌పూర్, డిసెంబర్ 19 (ప్రభాతవార్త):**

మండల పరిధిలోని జంగంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సట్టు రాములు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా అతని కుటుంబ సభ్యులను మండల రజక సంఘం నాయకులు మంగళవారం పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రజకులకు తమ సంఘం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రజక సంఘం గౌరవ అధ్యక్షుడు అక్కారం నర్సింలు, ఉపాధ్యక్షులు వడ్లకొండ శ్రీనివాస్, రాచకొండ యాదగిరి, కోశాధికారి రాచకొండ బాల్‌నర్సయ్య, సంయుక్త కార్యదర్శి రాచమల్ల పాండు, జూపల్లి మహేష్, గ్రామ రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# వరి నారుమడుల సంరక్షణకు శాస్త్రీయ సూచనలు పాటించాలి

### - రైతులతో వ్యవసాయాధికారి రాగమ్మ

**మొయినాబాద్, డిసెంబర్ 19 ప్రభాతవార్త:**

యాసంగిలో చలి ప్రభావం కారణంగా వరి నారుమడుల సంరక్షణకు తాము ఇచ్చే శాస్త్రీయ సలహాలను పాటించాలని మొయినాబాద్ మండల వ్యవసాయాధికారిణి రాగమ్మ రైతులకు సూచించారు. మండలంలోని శ్రీరామ్‌నగర్ గ్రామంలో రైతులకు వరి నారుమడుల సంరక్షణకు సంబంధించి మంగళవారం పలు సూచనలు చేశారు. రైతుల పంట పొలాల వద్దకు ఆమె చేరుకుని అవసరమైన సూచనలు, సలహాలు అందించారు. యాసంగిలో చలి ప్రభావం నుంచి నారు మడులలో నారు ఎదగకపోవడం, ఆకులు పసుపు, ఎరుపు రంగులోకి, కొన్నిసార్లు నారు చనిపోవడం వంటి వాటిపై రైతులు చేపట్టాల్సిన రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. సాయంత్రం వేళలో నారుమడిలో నీరు తీసివేసి పడటి పూట వెచ్చటి నీరు పెడుతూ ఉండాలని సూచించారు. జింకు లోపం వల్ల ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడకుండా జింకు సల్ఫేట్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని అన్నారు. అలాగే నారు ఆరోగ్యంగా పెరగడానికి యూరియా వేస్తున్నప్పుడు ఒక కిలో యూరియాకి 2 గ్రాముల కార్బెండాజిమ్+మాంకోజెబ్ మిశ్రమ మందును కలిపి పిచికారి చేయాలని తెలిపారు. కాండం తొలిచే పురుగు



యాసంగిలో చలి ప్రభావం కారణంగా వరి నారుమడుల సంరక్షణకు గాను రైతులకు సూచనలు ఇస్తున్న మొయినాబాద్ మండల వ్యవసాయాధికారిణి రాగమ్మ

బారిన పడకుండా కార్బోఫురాన్ 3జి గుళికలు ఎకరాకు సరిపడా నారుమడికి ఒక కిలో చొప్పున చల్లాల్సి ఉంటుందని వ్యవసాయాధికారిణి సూచించారు. అగ్గితెగులు ఆశించకుండా ముందు జాగ్రత్తగా ట్రైసైక్లోజాల్ 0.6 గ్రాములు లీటర్ నీటికి చొప్పున పిచికారి చేయాలని ఆమె రైతులకు వివరించారు.

# జనవరి 1 నాటికి కొత్త ఓట్లు నమోదు చేసుకోవాలి

### - 20 నుంచి ఓటర్ లిస్ట్‌లపై పని చేయాలి
### -తలకొండపల్లిలో బిఎల్ఓ సమావేశంలో కల్వకుర్తి ఆర్డీవో శీను



**తలకొండపల్లి డిసెంబరు19,ప్రభాతవార్త :**

కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 20 నుంచి ఓటర్ లిస్టులపై బిఎల్వోలు పనిచేయాలని కల్వకుర్తి ఆర్డిఓ శీను తెలిపారు.మంగళవారం తలకొండపల్లి మండల కేంద్రంలో తహసీల్దార్ రంగారెడ్డి అధ్యక్షతన మండల బిఎల్‌వోలకు ఓటర్ లిస్ట్‌లపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కల్వకుర్తి ఆర్డివో శ్రీను మాట్లాడుతూ...ఈనెల 20 నుంచి జనవరి 5వరకు ఓటర్ లిస్టులపై చేర్పులు మార్పులు చేసేందుకు ప్రజలను ప్రోత్సహించాలన్నారు.జనవరి 6 నుంచి అభ్యంతరాలను స్వీకరించి ఫిబ్రవరి 2న ముగించాలని ఆయన సూచించారు.ఫిబ్రవరి 8న తుది ఓటర్ లిస్టు జాబితా విడుదల కానున్నందున ఆయా గ్రామాల్లోని ప్రజలందరికి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.నూతనంగా ఓటు హక్కు నమోదు చేసుకునేవారు జనవరి 1వరకు 18 సంవత్సరాల పూర్తి చేసుకున్న వారికి అవకాశం ఉన్నట్లు ఆయన తెలియజేశారు.ప్రతి బిఎల్ఓ గ్రామ ప్రజలందరికి అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రంగారెడ్డి,ఆర్ఐ భాగ్యలక్ష్మి,ఆయా గ్రామాల బిఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

**చేవెళ్ల, డిసెంబర్ 19 ప్రభాతవార్త :**

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వాటిని క్లుప్తంగా ప్రజలకు అర్ధమయ్యేలా వివరించాలని చేవెళ్ల మాజీ పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చేవెళ్ల మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో వికసిత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని తెలిపారు. ప్రజల వద్దకు ప్రభుత్వాన్ని పంపిస్తున్న గొప్ప ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అని అన్నారు. భారతదేశం అభివృద్ధి చెందాలంటే మరోసారి మోడీయే ప్రధాని కావాలని తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమంను ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బూర రవీందర్‌రెడ్డి, శ్రీరామ్‌నగర్ సర్పంచ్, స్టేట్ కౌన్సిల్ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి,ప్రభుత్వ అధికారులు,గ్రామస్తులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



వికసిత్ సంకల్ప యాత్రలో మాట్లాడుతున్న చేవెళ్ల మాజీ పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి.

# అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అమలు

### -6 గ్యారెంటీలతో ప్రజలకు న్యాయం: జడ్పీచైర్మన్



ఘట్‌కేసర్ మండల పరిషత్ కార్యాలయంలో అవుషాపూర్ షాదీముభారక్ లబ్దిదారుకు చెక్కు అందజేస్తున్న జడ్పీచైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

**ఘట్‌కేసర్, డిసెంబర్ 19, ప్రభాతవార్త:**

అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన ఏర్పాట్లు చేస్తుందని మేడ్చల్ జడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండల పరిషత్ కార్యాలయం సమావేశపుహాలులో మంగళవారం కళ్యాణలక్ష్మి, షాదీముభారక్ పథకాలకు సంబంధించిన 18 మంది లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. జడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డితో కలిసి స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి 8, పోచారం మున్సిపాలిటీకి 5, ఘట్‌కేసర్ మండలానికి 5 చొప్పున రూ.1,00,116ల చెక్కులను వారు పంపిణీ చేశారు. జడ్పీచైర్మన్ శరత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వంద రోజుల్లో 6 గ్యారెంటీల సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే రాజీవ్‌ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం అమలు చేసిందని, త్వరలో ప్రజలకు ఇచ్చిన మిగతా పథకాలను అందుబాటులోకి తీసుకువస్తారని తెలిపారు. ఆడబిడ్డ పెళ్లి చేస్తే లక్ష రుపాయలతో పాటు తులం బంగారం కూడా అందించే పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్దం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేదలు ధరఖాస్తు చేసుకొని లబ్ది పొందాలని సూచించారు. పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టి ప్రజలకు మేలు చేసేలా అందరూ కలిసి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, వైఎస్ ఎంపిపి కర్రె జంగమ్మ, ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల చైర్‌పర్సన్లు ముల్లి పావని జంగయ్యయాదవ్, వైఎస్ చైర్మన్లు పలుగుల మాధవరెడ్డి, నానావత్ రెడ్డియానాయక్, తహశీల్దార్ జి.కృష్ణ, ఎంపిడిఓ వై.అరుణ, సర్పంచులు ఒరుగంటి వెంకటేశ్‌గౌడ్, ఏనుగు కావేరి మశ్చేంధర్‌రెడ్డి, ఎంపిటిసి సభ్యులు పులకంటి భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు చందుపట్ల వెంకట్‌రెడ్డి, బండారి అంజనేయులుగౌడ్, కడుపొల్ల మల్లేశ్, కుతాడి రవీందర్, సుర్వి రవీందర్‌గౌడ్, కోఆప్షన్‌సభ్యులు అక్రమ్‌అలీ, సహకార సంఘం డైరక్టర్లు రేసు లక్ష్మారెడ్డి, చందుపట్ల ధర్మారెడ్డి, కీసరగుట్ట డైరక్టర్ ఎంపాల సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మందడి సురేందర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసిలు మేకల నర్సింగ్‌రావు, చిల్కూరి గోపాల్‌రెడ్డి, కందుల కుమార్, మాజీ వార్డుసభ్యులు బొక్క ప్రభాకర్‌రెడ్డి, మామిండ్ల ముత్యాలుయాదవ్, పడిగెం వెంకటేశ్వరావు, కీసరగుట్ట మాజీ డైరక్టర్ మెరుగు నరేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

## అయ్యప్పలకు అన్నదానం పూర్వజన్మ సుకృతం

### -మేకగూడ యువ కాంగ్రెస్ నేత బండారు రాజు ముదిరాజ్



మేకగూడలో స్వాములకు అన్నదానం నిర్వహిస్తున్న బండారు రాజు ముదిరాజ్

**నందిగామ డిసెంబరు19,ప్రభాతవార్త :**

పిట్ట కొంచెం కూత ఘనం అన్నట్లుగా వయస్సులో చిన్నవాడైనా ప్రజాసేవయే పరమార్థంగా భావించి సమాజ సేవలో ముందుకు సాగుతూ పలువురికి ఆదర్శంగా నిలిచాడు.నందిగామ మండలం మేకగూడ గ్రామానికి చెందిన యువ కాంగ్రెస్ నేత బండారు రాజు ముదిరాజ్ మేకగూడ గ్రామానికి చెందిన యువ కాంగ్రెస్ నేత బండారు రాజు ముదిరాజ్ గ్రామంలో 41 రోజుల పాటు దీక్ష చేపట్టిన అయ్యప్ప స్వాములకు స్థానిక హనుమాన్ దేవాలయం సన్నిధానంలో సొంత ఖర్చులు వెచ్చించి నిత్యం అన్నదానం చేస్తున్నారు.ఈ సందర్భంగా అన్నదాన ప్రభువు బండారు రాజు ముదిరాజ్ మాట్లాడుతూ...అయ్యప్ప స్వాములకు అన్నదానం చేయడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామన్నారు.ఓంకార మూర్తి అయ్యప్పను కొలిచిన భక్తులందరికి మంచి జరగాలని ఆయన కోరుకున్నారు.అయ్యప్ప మాల ధరించిన గురుస్వామిలు రాందేవ్ రెడ్డి,మేకం రాజు ముదిరాజ్,గోపాల్ యాదయ్య,మేక్కం శేఖర్,మెక్కం రమేష్‌ల ఆశీర్వాదంతో అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.అయ్యప్ప స్వాములకు నిత్యం అన్నదానం చేస్తున్న బండారు రాజు ముదిరాజ్ సేవలను చుట్టుపక్కల అయ్యప్ప స్వాములు,గ్రామస్తులు,పలువురు అభినందిస్తున్నారు.

## మృతుడి కుటుంబానికి రూ.3 వేలు అందజేత

**కోట్‌పల్లి,డిసెంబరు 19, ప్రభాతవార్త :** కోట్‌పల్లి మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో మంగళి అనంతయ్య ఆకస్మాత్తుగా మృతి చెందాడు విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచు గోడ్డలి మల్లయ్య, మృతుడు కుటుంబానికి ఓదార్చి తన ప్రగఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం మృతుడు కుటుంబ సభ్యులకు తనవంతుగా 3,వేల రూపాయాలను అందజేశారు.అయన వెంట గ్రామస్థులు తదితరులు ఉన్నారు,

## ఘనంగా ప్రారంభమైన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్



.కాచవాని సింగారంలోని నల్లమల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రారంభమైన స్మార్ ఇండియా హ్యాకథాన్ 2023 పోస్టర్‌ను ఆవిష్కరించిన ఏఐసీటీఈ అసిస్టెంట్ డైరక్టర్ రాకేష్ కుమార్ తదితరులు.

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 19, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ మండలంలోని కాచవాని సింగారంలో నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించే స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2023 కార్యక్రమం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. దివ్యా నగర్‌లోని నల్లమల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రారంభమైన జాతీయ స్థాయి స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ కార్యక్రమాన్ని కేంద్ర మంత్రిత్వశాఖ, ఏఐసీటీఈ సంయుక్తంగా 2017 నుండి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 19 నుండి 23 వరకు జరిగే స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ కార్యక్రమాన్ని ఏఐసీటీఈ అసిస్టెంట్ డైరక్టర్ డాక్టర్ రాకేష్ కుమార్ గంజు, పుణేకు చెందిన సుప్రియ మంగ్లేకర్‌లు హాజరయి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ అత్యుత్తమ విద్యావిధానాన్ని కొనసాగిస్తున్న మల్లారెడి ఇంజినీరింగ్ కళాశాలకు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహించే అవకాశం దక్కడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్లమల్లారెడ్డి కళాశాల డైరక్టర్ దివ్య నల్ల, కళా శాల చైర్‌పర్సన్ కేతిరెడ్డి సంధ్యావతి, మల్లారెడ్డి స్కూల్ డైరక్టర్ స్నేహ నల్ల, ప్రిన్సిపాల్ ఎంఎన్‌వి. రమేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కృష్ణస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

## మహోన్నతుడు మాజీ మేయర్ కృష్ణస్వామి

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 19, ప్రభాతవార్త :**

పాత్రికేయ సంపాదకుడు హైదారాబాద్ మాజీ మేయర్ కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ ప్రజా సేవ చేస్తూనే ముదిరాజ్ హక్కుల సాధన కోసం పోరాటం చేసిన మహోన్నతుడు అని ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. కృష్ణస్వామి 56వ వర్ధంతి సందర్భంగా చిన్నకోదూరు మండల కేంద్రంలో మంగళవారం అయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అయన మాట్లాడుతూ కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ 1922లో నిజాం రాజ్య కాలంలో ముదిరాజ్ మహాసభను స్థాపించారని తెలిపారు. 40 యేండ్ల పాటు మహాసభకు అధ్యక్షుడిగా పని చేశారని తెలిపారు. అనేక గ్రంధాయాలను స్థాపించడంతో బడుగు, బలహీన వర్గాల విద్య కోసం ఎంతో శ్రమించారని పేర్కొన్నారు. స్త్రీ అక్షరాస్యతను ప్రోత్సహించడానికి హిందీ కన్యా పాఠశాలను ఏర్పాటు చేశారని వివరించారు. అయన మేయర్‌గా ఉన్న సమయంలో హైదారాబాద్‌కు మాస్టర్ ప్లాన్‌ను ఖరారు చేశారని వివరించారు. హైదారాబాద్ మేయర్‌గా అప ్పటి ప్రధాన మంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూను అహ్వానించారని తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షులు చింతకింద ప్రభాకర్, పిట్ల నాగార్జున, కొరమేన సుధాకర్, దొంతురమేన శ్రీనివాస్, అంబటి కనకయ్య, జంగిటి ప్రభాకర్, గుడిపల్లి వికాస్, గౌరమేన స్వామి, దయ్యాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ముక్కోటి ఏకాదశి గోడపత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ

**గజ్వేల్ టౌన్, డిసెంబర్ 19 (ప్రభాతవార్త):**



కరపత్రాలు, గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

భద్రాచలం దేవస్థానంలో ఈనెల 23న నిర్వహించే ముక్కోటి ఏకాదశికి సంబంధించిన గోడపత్రికలు, కరపత్రాలను ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి మంగళవారం గజ్వేల్ పట్టణంలోని శ్రీమురళీ కృష్ణాలయం ఆవరణలోని రామాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా లక్షల మంది భక్తులచే రామకోటి లిఖింపజేస్తున్న రామరాజు సేవను గుర్తించి భద్రాచలం దేవస్థానం వారు ప్రతి సంవత్సరం ముక్కోటి ఏకాదశి కరపత్రాలను, గోడపత్రికలను పంపించడం జరుగుతుందన్నారు. సామాజిక సమరసత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేష్‌బాబు మాట్లాడుతూ ఉత్తర ద్వార దర్శనం వల్ల కోటి పుణ్యాల ఫలితం కలుగుతుందన్నారు. రామకోటి రామరాజును మరో భక్త రామదాసుగా భద్రాచలం దేవస్థానం గుర్తించడం సంతోషం అన్నారు. ఈ కార్యక్రమంలో మురళీ కృష్ణాలయం అధ్యక్షుడు ఎలగందుల రామచంద్రం, ఉప్పల వెంకటేషం, దూబకుంట మైత్రాములు, అత్తెల్లి లక్ష్మయ్య, అంతునూరి శివకుమార్, తుమ్మ మల్లేశం, దొంతుల దశరథం, మహంకాళి శ్రీనివాస్, బండి నర్సయ్య, శ్రీనివాస్, మహేష్, కరాటే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజ్ఞాపూర్‌లో దొంగల బీభత్సం

### -పనిచేయని సిసి కెమెరాలు



వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ యాదగిరిరెడ్డి

**గజ్వేల్, డిసెంబర్ 19 (ప్రభాతవార్త):** గజ్వేల్ మున్సిపల్ పరిధి ప్రజ్ఞాపూర్‌లోని ఓ ఇంటి తాళం పగులగొట్టి గుర్తుతెలియని దొంగలు ఇంట్లోకి చొరబడి బంగారంతోపాటు నగదు ఎత్తుకెళ్లిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. గజ్వేల్ సిఐ జాన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ప్రజ్ఞాపూర్ గ్రామానికి చెందిన వడ్డేపల్లి ప్రసాద్ ప్రజ్ఞాపూర్‌లో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం కుటుంబసభ్యులతో కలిసి మేడారం జాతరకు వెళ్ళాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఆదివారం రాత్రి ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలో ఉన్న లక్షా 40వేల నగదు, నాలుగున్నర తులాల బంగారం ఎత్తుకెళ్ళారు. సోమవారం ఇంటికి చేరుకున్న ప్రసాద్ ఇంట్లో దొంగలు పడ్డట్లు గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు, క్లూస్ టీం సభ్యులు దొంగతనం జరిగిన ఇంటికి వెళ్ళి పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ జాన్‌రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా ప్రజ్ఞాపూర్‌లోని ఇందిరాగాంధీ స్టాచ్‌నుండి రామాలయం వరకు ఏర్పాటుచేసిన సిసి కెమెరాలు గత నాలుగు నెలల నుండి పనిచేయడంలేదు. ఇప్పటికైనా పోలీసులు సిసి కెమెరాలను మరమ్మతు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

## పల్లవి ప్రశాంత్‌ను అభినందించిన హరీష్‌రావు



హరీష్‌రావుతో ఫోన్‌లో మాట్లాడుతున్న పల్లవి ప్రశాంత్

**గజ్వేల్, డిసెంబర్ 19 (ప్రభాతవార్త):** బిగ్‌బాస్ షోలో విజయం సాధించిన పల్లవి ప్రశాంత్‌కు సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్‌రావు ఫోన్‌చేసి అభినందించారు. ఈ సందర్భంగా పల్లవి ప్రశాంత్ మాట్లాడుతూ హరీష్‌రావు తనకు ఫోన్ ద్వారా అభినందనలు తెలిపారని, బిగ్‌బాస్ షోలో విజయం సాధించడం పట్ల సంతోషంగా ఉందన్నారు.

## జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

**ఆదిభట్ల డిసెంబరు19,ప్రభాతవార్త :**

కాకినాడలో జరిగిన రెండో ఇన్విటేషనల్ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో ఆదిభట్ల మున్సిపాలిటీ సమీపంలో గల బొంగులూరులోని నలంద హై స్కూల్ విద్యార్థులు వి.శ్రీనిత్ కుమార్,జోషన్ని పాల్గొని ప్రతిభ చాటారు.శ్రీనిత్ కుమార్ స్పేరింగ్‌లో గోల్డ్ మెడల్,కటాస్‌లో బ్రాంజ్ మెడల్ సాధించగా జోషన్ని కటాస్‌లో రజతపతకం సాధించారు.